అక్రమార్కులు ఊచలు లెక్కించాల్సిందే: మంత్రి సత్యకుమార్


తాడిమర్రిలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

తాడిమర్రి, న్యూస్‌టుడే: జగన్‌మోహన్‌రెడ్డి నిర్బంధ నియంతృత్వ పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి లభించిందని, వారి ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. గురువారం తాడిమర్రి మండలంలో పలు గ్రామాల్లో మంత్రి సత్యకుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా తాడిమర్రిలో ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత వైకాపా పాలనలో రాష్ట్రం అన్ని రకాలుగా అధోగతిపాలైందని, పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి తన అక్రమ సామ్రాజ్యాన్ని విస్తరించుకుని, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసాడని విమర్శించారు. అక్రమాలకు పాల్పడిన వైకాపా నాయకులు ఊచలు లెక్కించాల్సిందేనని, జైలు జీవితం ప్రశాంతంగా గడిపేలా చేస్తామని మంత్రి వివరించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కాటమయ్య, ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి, తెదేపా మండల కన్వీనర్ కూచి రాము తదితరులు పాల్గొన్నారు.

ఈ-నేత్ర.. మూత

రాయదుర్గం పట్టణం, ఉరవకొండ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి ఈ-నేత్ర కేంద్రాలు మూతపడ్డాయి. 2018లో తెదేపా ప్రభుత్వ హయాంలో జిల్లాలోని అన్ని సీహెచ్‌సీల్లో పది కేంద్రాలను ప్రారంభించారు. ఈనెల 4వ తేదీతో రాష్ట్ర ప్రభుత్వం, అపోలో ఆసుపత్రి మధ్య ఒప్పందం గడువు ముగిసింది. దాంతో సేవలు నిలిచిపోయాయి. ఈ కేంద్రాల్లో రోజూ 50 మందికి పైగా చికిత్సలు పొందేవారు. అవసరమైన వారికి కళ్లద్దాలు ఇచ్చేవారు. ప్రస్తుతం ఈ కేంద్రాలు తెరచుకోక పోవడంతో నేత్ర సంబంధ వ్యాధులతో వచ్చిన రోగులు వెనుదిరుగుతున్నారు. ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా 2,64,818 మంది కంటి చికిత్సలు పొందినట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. కంటి చికిత్సలకు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీ రూ.200 అవుతుంది. కళ్లద్దాలు కావాలంటే మరో రూ.2,000 అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఫలితంగా పేదలపై భారం పడనుంది. కూటమి ప్రభుత్వం ఈ కేంద్రాలను పునఃప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.


రాయదుర్గంలో మూతపడిన కేంద్రం

గడువు ముగియడంతోనే..

- జగన్‌మోహన్, జిల్లా మేనేజర్, ఈ-నేత్ర కేంద్రం

ప్రభుత్వం-అపోలో ఆసుపత్రి మధ్య ఒప్పందం ముగియడంతోనే కేంద్రాలను మూసేశాం. ఎప్పుడు ప్రారంభిస్తారనేది ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఆ మేరకు మళ్లీ సేవలు ప్రారంభమవుతాయి.


సీహెచ్‌సీల వారీగా చికిత్స పొందిన రోగుల సంఖ్య

ధర్మవరం	35,735
కళ్యాణదుర్గం	31,013
మడకశిర	26,758
పెనుకొండ	31,596
రాయదుర్గం	21,703
శింగనమల	24,349
తాడిపత్రి	27,564
ఉరవకొండ	25,971
సీకే పల్లి	20,283
నల్లమాడ	19,840

ఈనాడు డిజిటల్, అనంతపురం -న్యూస్‌టుడే, ఉరవకొండ

స్వామీ.. రక్షణేదీ?

- దేవాలయాల్లో పనిచేయని సీసీ కెమెరాలు
- ఆందోళన కలిగిస్తున్న చోరీలు, ఘటనలు



ఉమ్మడి జిల్లాలో ఆలయాలకు రక్షణ లేకుండా పోతోంది. అధికారుల నిర్లక్ష్యం.. భద్రతా వైఫల్యాలను అవకాశంగా మలుచుకుంటున్న దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. ఆలయాలను నుంచి వచ్చే ఆదాయాన్ని వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల కణేకల్లు మండలం హనకనహాళ్‌లో సీతారాముల ఆలయ రథానికి నిప్పు పెట్టడంతో మరోసారి భద్రతా వైఫల్యాలు బహిర్గతమయ్యాయి. దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాలకే రక్షణ కరవైనప్పుడు ఇతర దేవస్థానాల పరిస్థితి ఏంటని భక్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆలయాల నుంచి ప్రభుత్వానికి రూ.కోట్లల్లో ఆదాయం వస్తున్నా రక్షణ చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భక్తుల తాకిడి అధికంగా ఉండే ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లోనూ సీసీ కెమెరాలు పని చేయకుండా ఉండటం ఆ శాఖ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. దీంతో ఆలయాలను లక్ష్యంగా చేసుకుంటున్న దొంగలు వరుస చోరీలకు పాల్పడుతున్నారు.

గత తెదేపా ప్రభుత్వంలో నిఘా నేత్రాల ఏర్పాటు

ఉమ్మడి అనంత జిల్లాలో గత తెదేపా ప్రభుత్వ హయాంలో ముఖ్య ఆలయాలన్నింటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక నిఘా వ్యవస్థ సైతం ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో ఆలయాల వద్ద భద్రతను పెంచారు. అప్పట్లోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 170 ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆలయాల్లో భద్రతా పర్యవేక్షణను గాలికొదిలేసింది. ప్రస్తుతం 40 ఆలయాల్లో మాత్రమే సీసీ కెమెరాలు పని చేస్తున్నాయి. భద్రతను దేవాదాయ శాఖ పూర్తిగా గాలికొదిలేసింది. ఉమ్మడి జిల్లాలో ఆలయాల వివరాలు ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు తెలియకపోవడం గమనార్హం. ఎన్ని చోట్ల సీసీ కెమెరాలు ఉన్నాయి? వాటిలో ఎన్ని పనిచేస్తున్నాయో కనీస సమాచారం తమ వద్ద లేదని చెప్పడం ఆ శాఖ నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తోంది.

ఏడాది కిందట కసాపురం ఆలయంలో దుండగులు చేతివాటం చూపిస్తూనే ఉన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల పర్సులతో పాటు ద్విచక్రవాహనాలు తరచూ చోరీకి గురవుతున్నాయి. సీసీ కెమెరాల నిఘా వ్యవస్థలో లోపాన్ని చోరులు అవకాశంగా తీసుకుంటున్నారు. ఏడాది కిందట ఆలయ రక్షణ విభాగం ఇన్‌ఛార్జే హుండీలో నగదు తస్కరించాడు.

గార్లదిన్నె మండలం కోటంక గుంటి సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో జూన్ 6న బీరువాలోని స్వామి వారి నగలు దోచుకెళ్లారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లారు. దొంగల్ని పట్టుకుని 16.250 కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆలయంలో 12 సీసీ కెమెరాలు ఉండగా.. మరో ఎనిమిది అవసరమని అధికారులు చెబుతున్నారు.

పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ రథం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయక ఏడాది కావొస్తోంది. ఆలయంలోనూ భద్రతా వైఫల్యాలు కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. ఆటవీ ప్రాంతం కావడంతో ఆకతాయిలు నిత్యం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లిలోని చౌడేశ్వరీ ఆలయంలో ఆగస్టు 4న అమ్మవారి నాలుగు కిలోల వెండి ఆభరణాలతోపాటు హుండీ దోచేశారు. సీసీ కెమెరాలు పగలగొట్టి హుండీలోని నగదును ఎత్తుకెళ్లారు. రాత్రి వేళల్లో ఆలయంలో భద్రతా సిబ్బంది ఉండటం లేదు.

గుప్త నిధుల వేటలో..

ఉమ్మడి జిల్లాలోని పురాతన ఆలయాల్లో గుప్త నిధుల వేట ఇంకా కొనసాగుతూనే ఉంది. ఏటా కేసులు నమోదవుతున్నా వాటి నివారణకు కనీస చర్యలు తీసుకోవడం లేదని భక్తులు విమర్శిస్తున్నారు. గుత్తి, కళ్యాణదుర్గం, హిందూపురం, పుట్టపర్తి, కళ్యాణదుర్గం, ఉరవకొండ, పెనుకొండ, మడకశిర ప్రాంతాల్లోని పురాతన ఆలయాలను లక్ష్యంగా చేసుకుంటున్న దుండగలు గుప్త నిధుల కోసం నిర్మాణాలను ధ్వంసం చేస్తున్నారు. పలు ఆలయాల్లో విగ్రహాలను ఎత్తుకెళ్లి.. నిధుల వేట కొనసాగిస్తున్నారు. ఆలయాల బయట ఉన్న రథాలకూ రక్షణ లేకుండా పోయింది.


పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ రథం

భద్రత పటిష్ఠం చేస్తాం..

- జగదీశ్, ఎస్పీ, అనంతపురం

కణేకల్లులో రథం దహనం చేసిన ఘటనను పోలీసు శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. జిల్లాలోని అన్ని ఆలయాల్లో భద్రత పరిస్థితులపై సమీక్షిస్తున్నాం. ప్రతి ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. వీలైనంత వేగంగా ఆలయాల్లో పనిచేయని సీసీ కెమెరాలను బాగు చేయడంతో పాటు లేనిచోట కొత్తవి ఏర్పాటు చేస్తాం.

816 బడుల్లో పౌష్టికాహార తోటలు


జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల్లో పౌష్టికాహార తోటలను (న్యూట్రిషన్ గార్డెన్) పెంచాలి. ఇందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో విద్య, సమగ్రశిక్షా, ఆరోగ్యం, ఉద్యానం, వ్యవసాయం, ఐసీడీఎస్, కృషి విజ్ఞానం, అటవీ..వంటి సమన్వయ శాఖలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. తొలి విడతగా జిల్లాలో 816 పాఠశాలల్లో పెరటి తోటలను పెంచాలన్నారు. సమగ్ర శిక్షా నుంచి సత్వరమే ప్రతి పాఠశాలకు రూ.2 వేలు నిధులు వెచ్చిస్తామన్నారు. ఈ పెరటి తోటల వల్ల విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలు లభిస్తాయన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి స్థానిక పెరటి తోటలో పండించే వాటినే వాడుకోవచ్చన్నారు. ఇందుకు ప్రతి పాఠశాలలో ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మునగ, కరివేపాకు, వంటి మొక్కలు నాటాలి. పాఠశాలల్లో అనువైన స్థలం లేకపోతే మట్టి, సిమెంటు కుండలు, పాడైన గిన్నెలు, పెట్టెలు, డబ్బాలు..వినియోగించి కూరగాయలు పండించాలని సూచించారు. సహాయ కలెక్టర్ వినూత్న, డీఈఓ వరలక్ష్మి, సమగ్ర శిక్షా ఏపీసీ నాగరాజు, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రూ.1, 2, 5, 10.. నాణేలు తీసుకోవాలి

ఆర్‌బీఐ విడుదల చేసిన నాణేలను విధిగా తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. 1, 2, 5, 10 రూపాయల నాణేలను లావాదేవీల్లో తీసుకోవాలని వ్యాపారులు, దుకాణదారులకు సూచించారు. ఎవరు తీసుకోకపోయినా తగిన చర్య ఉంటుందన్నారు.

విద్యార్థుల్లేని పాఠశాల

రోజూ విధుల్లో ఉపాధ్యాయుడు


దయ్యాలకుంటపల్లిలో విధులకు హాజరైన ఉపాధ్యాయుడు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : ఆ పాఠశాలకు సంపూర్ణంగా తరగతి గదులున్నాయి. బోధనకు ఉపాధ్యాయులు.. మధ్యాహ్న భోజన వసతి ఉంది. ఎన్ని ఉన్నా ఉండాల్సిన వారు లేకపోతే ఏం ప్రయోజనం. అదేనండీ ఉండాల్సిన వారంటే ఎవరనుకుంటున్నారు? ఇంకెవరుంటారు విద్యార్థులే కదా. ఇంతటి దయనీయస్థితి మధ్య నడుస్తున్న పాఠశాల ఏదంటే... బుక్కరాయసముద్రం మండలంలోని దయ్యాలకుంటపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల. ఇక్కడ ఒక్కరంటే ఒక్క విద్యార్థీ బడికి రావడం లేదంటే ఆశ్చర్యం కలగక మానదు. అందులోనూ ఈ విద్యాసంవత్సరం ఒక్కరే చేరడం గమనార్హం.

అసలు విషయం ఏమిటంటే?

దయ్యాలకుంటపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గతంలో 5వ తరగతి వరకు 70 మంది విద్యార్థులు చదువుకునేవారు. గత వైకాపా ప్రభుత్వం పాఠశాలల విలీన ప్రక్రియతో ఇక్కడ చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను వెంకటాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. తర్వాత దయ్యాలకుంటపల్లి పాఠశాలలో కేవలం 1, 2 తరగతులకు చెందిన ఎనిమిది మంది పిల్లలు మాత్రమే మిగిలారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న కారణంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఒకరు మాత్రమే చేరారు. సదరు విద్యార్థిని కూడా మరో పాఠశాలకు వెళ్లిందని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో ఉపాధ్యాయుడు సుంకన్నతోపాటు మధ్యాహ్న భోజన ఏజెన్సీ సిబ్బంది ఇద్దరు రోజూ విధులకు హాజరవుతుండటం గమనార్హం. దీనిపై మండల విద్యాధికారి లింగానాయక్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వివరించారు.



నల్లబాతులు.. ముచ్చట గొలిపే విన్యాసాలు

ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లో నీరు చేరి జలకళ సంతరించుకున్నాయి. చెరువులో చేపల లభ్యత పెరగడంతో వాటి కోసం నల్లబాతులు సందడి చేస్తున్నాయి. నీటి లోపలికి వెళ్లి చేపలను నోట కరచుకుని బయటకు వచ్చి ఆరగించటం వీటి ప్రత్యేకత. చెరువులో ఈదుతూ, ఎగురుతూ చేసే విన్యాసాలు కనువిందు చేస్తున్నాయి. ఆత్మకూరు మండలం బి.యాలేరు చెరువులో రమణీయ దృశ్యాలివి

- ఈనాడు, అనంతపురం


చేపల వేటలో..

ఉమ్మడి జిల్లా ఆర్డీఓల బదిలీ

అనంతకు కేశవనాయుడు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలో కీలకమైన అధికారులను బదిలీ చేస్తూ గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని మొత్తం ఏడుగురు ఆర్డీఓలు బదిలీ కావడం విశేషం. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒకేసారి బదిలీ చేయడం ఇదే ప్రథమం. అనంతపురం ఆర్డీఓగా కేశవనాయుడు, కళ్యాణదుర్గంకు వసంతబాబు, గుంతకల్లుకు ఏబీవీఎస్‌డీ శ్రీనివాస్, కదిరి ఆర్డీఓగా వీఎస్ శర్మ, పెనుకొండకు ఆనంద్‌కుమార్, ధర్మవరానికి మహేశ్, పుట్టపర్తి ఆర్డీఓగా పి.సువర్ణను నియమించారు. కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణి సుస్మిత కొవ్వూరు డివిజన్‌కు, కదిరి ఆర్డీఓ సన్ని వెంకటేశ్ కావలి డివిజన్‌కు బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లాలోని ఇతర డివిజన్లలో పని చేస్తున్న ఆర్డీఓలకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. అనంత ఆర్డీఓగా నియమితులైన కేశవనాయుడు గతంలో జిల్లాలో అనేక హోదాల్లో పని చేశారు.

జనులారా.. తిలకించండి కనులారా!

- సమీపానే సుందర ప్రాంతాలు
- నేడు పర్యాటక దినోత్సవం

★ పర్యాటక ప్రాంతం ● ప్రత్యేకత
■ అనంతపురం నుంచి ఎంత దూరం ✦ రవాణా సౌకర్యం

జీవన గమనంలో నిత్యం ఎన్నో పనులతో అలసిపోతున్న శరీరాలకు కాసింతైనా ఆటవిడుపుందా.. కొత్తగా ఆలోచిస్తున్నామా.. ఎక్కడికైనా వెళ్తున్నామా.. ప్రత్యేక ప్రాంతాలను తెలుసుకుంటున్నామా? అలా చేయకపోతే ఇక నుంచైనా సమయం వెచ్చించి.. కొత్త ప్రదేశాలను చూసి ఆహ్లాదాన్ని ఆస్వాదించాలని ఉందా.. అయితే ఈ కథనం మీకోసమే.. ఎక్కడో సుదూరాన ఉండే ప్రదేశాలే కాదు.. తక్కువ ఖర్చు, మన చుట్టూనే ఉన్న పర్యాటక ప్రాంతాల వైపు ఓ కన్నేయండి. పొద్దున వెళ్లి సాయంత్రానికి తిరిగి వచ్చేలా.. ఆధ్యాత్మిక, పర్యాటక, వైజ్ఞానిక ప్రాంతాలను చుట్టిరండి. పిల్లాపాపలతో సందర్శించి, విశిష్టతలను కనులారా తిలకించి అనుభూతులను మనసు నిండా నింపుకోండి మరి.

మదిని దోచే నందికొండ



★ నందికొండ

● నందికొండపై ఆకాశం నుంచి సన్నగా పడే చినుకులు.. దట్టమైన పొగమంచు మదిని దోచేస్తుంది. కొండపై నుంచి సూర్యోదయాన్ని తిలకించడం ఓ మధురానుభూతిని మిగుల్చుతుంది. తెల్లవారుజామున 5 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సందర్శించవచ్చు. ఎక్కువ మంది సూర్యోదయాన్ని తిలకించేందుకు ఇష్టపడతారు. శని, ఆదివారాల్లో సందడిగా ఉంటుంది.


■ 185 కి.మీ.

✦ చిక్కబళ్లాపూర్ వరకు బస్సుల్లో వెళ్లొచ్చు. అక్కడి నుంచి ప్రైవేటు ట్యాక్సీలు, బస్సులు ఉంటాయి. సొంత వాహనాల్లో నేరుగా చేరుకోవచ్చు.

- న్యూస్‌టుడే, బెంగళూరు(యశ్వంతపుర)

సహజ సంపద.. బెలుం గుహలు

★ బెలుం గుహలు



● అనంతపురం జిల్లా సరిహద్దులో ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతం. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం బెలూం గ్రామంలో గుహలు ఉన్నాయి. భూమి ఉపరితలానికి సుమారు 20 మీటర్ల లోతులో 10 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్నాయి. లోపల మంచినీటి కొలనులు, సహజంగా ఏర్పడిన శిలలు, లింగాలు విశేషంగా ఆకర్షిస్తాయి. పెద్దలకు ప్రవేశ రుసుం రూ.70, పిల్లలకు రూ.50.

■ 83 కి.మీ. ✦ బస్సుల్లో చేరుకోవచ్చు.

- న్యూస్‌టుడే, తాడిపత్రి

కర్ణాటకాంధ్ర జీవనాడి


★ తుంగభద్ర జలాశయం


● తుంగభద్ర పుట్టుక, ప్రస్థానం మహాద్భుతం. మూడు రాష్ట్రాల అన్నదాతలకు ఆసరాగా నిలుస్తోంది. అద్భుతమైన శైలితో ఆనకట్ట నిర్మించారు. జలసవ్వడులు.. ఆకర్షణీయమైన ఉద్యానవనాలు ఆహ్లాదాన్ని పంచుతాయి. ఉదయం నుంచి రాత్రిదాకా పిల్లపాపలతో సేదదీరవచ్చు. జింకలు, గులాబీల పార్కు ఆకట్టుకుంటుంది. చేపల ఆక్వేరియాన్ని తిలకించవచ్చు.

■ 149 కి.మీ.

✦ బస్సు లేదా రైలులో హొసపేటె చేరుకోవాలి. అక్కడి నుంచి 4 కిలోమీటర్ల దూరంలో డ్యాం ఉంది. బస్సులు లేదా షేర్ ఆటోలు ఉంటాయి.

- న్యూస్‌టుడే, హొసపేటె


తుంగభద్ర జలాశయం



పర్ణజ ఆక్వేరియం

చారిత్రక వైభవ దీప్తి.. విజయనగర కీర్తి

★ హంపీ ● విజయనగర రాజధాని. దక్షిణ కాశీగా ప్రసిద్ధి. పర్యాటకులు సజీవ స్మారక ప్రాంతం(లివింగ్ మాన్యుమెంట్) అని పిలుస్తారు. 42 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన హంపీలో 200 స్మారకాలు ఉన్నాయి. అడుగడుగునా గుడులు, గోపురాలు ఉండటం విశేషం. ప్రధాన స్మారకాలను ఒకరోజులో చుట్టేయవచ్చు. ఇక్కడ త్రికాల పూజలందుకునే విరుపాక్షుడు కొలువుదీరారు. హంపీకి దగ్గర్లో దరోజీ భల్లూకాల సంరక్షణ కేంద్రం, పులి, సింహాల సఫారీలు ఉన్నాయి.

■ 164 కి.మీ.

✦ హంపీ ఎక్స్‌ప్రెస్ రైల్లో హొసపేటె చేరుకోవచ్చు. బస్సులో వచ్చేవారు బళ్లారి వచ్చి, అక్కడి నుంచి హొసపేటె రావాలి. ఇక్కడి ఆర్టీసీ బస్టాండు నుంచి అరగంటకు ఓ బస్సు బయల్దేరుతుంది. హంపీని చుట్టేయటానికి షేర్ ఆటోలు దొరుకుతాయి.

- న్యూస్‌టుడే, హొసపేటె


హంపీ క్షేత్రం


ఏకశిలా రథాన్ని తిలకిస్తున్న పర్యాటకులు

సహకార సంఘాల కంప్యూటరీకరణ వేగవంతం చేయాలి

తపోవనం (అనంత గ్రామీణం): ఉమ్మడి జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో వచ్చే నెల 2లోగా కంప్యూటరీకరణ పూర్తి చేయాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పీఐసీ, సంయుక్త కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. గురువారం సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘాల లావాదేవీలన్నీ వచ్చే నెలలో అంతర్జాలంలో కనిపించే విధంగా కంప్యూటరీకరణ చేయాలన్నారు. ఇప్పటికే నష్టాల్లో ఉన్న సొసైటీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి లాభాల్లోకి తీసుకురావాలని ఆయన సూచించారు. సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పరపతేతర వ్యాపారాలతో సొసైటీలను ఆర్థికంగా బలోపేతం చేస్తే ఉద్యోగులకు జీతాల సమస్య ఉండదన్నారు. దీనిపై సహకార సంఘాల ఉద్యోగులు జేసీ కలిసి అనేక సమస్యలపై విన్నపించారు. గత 18 నెలల నుంచి అనేక సొసైటీల ఉద్యోగులకు జీతాలు అందలేదని మొరపెట్టుకున్నారు.

పట్టు సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

- యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు
- రైతుల సమస్యలకు జేడీ పద్మావతి పరిష్కారాలు

ఈనాడు మీ తోడు



చరవాణి ద్వారా సమస్యలు తెలుసుకుంటున్న జేడీ పద్మావతి

పుట్టపర్తి, హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టు రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పలు పథకాలను అందిస్తోంది. రాయితీలను సద్వినియోగం చేసుకుని, యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు గడించవచ్చునని పట్టు పరిశ్రమలశాఖ జేడీ పద్మావతి పేర్కొన్నారు. గురువారం బైవోల్టిన్ పట్టు రైతులకు అందాల్సిన ప్రోత్సాహకాలు, బకాయిలు, రాయితీలు, పథకాలు, సాగులో ఇబ్బందులు, పాటించాల్సిన మెలకువలపై పట్టు పరిశ్రమలశాఖ జిల్లా అధికారి దుగ్గిరాల పద్మావతితో **పట్టు రైతులూ 'ఈనాడు' మీతోడు** కార్యక్రమం నిర్వహించారు. రైతుల సమస్యలు ఓపిగ్గా విన్న జేడీ వారి సందేహాలను నివృత్తి చేశారు.

సమస్య: కొత్తగా మల్బరీ తోట 4 ఎకరాల్లో సాగు చేసేందుకు భూమి దుక్కి చేసి సిద్ధం చేశా, ఎర్ర నేల, నీటి సదుపాయం ఉంది. ఎలాంటి రాయితీలు అందిస్తారు. **- రైతు ఆదినారాయణ, రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లి.**

జేడీ: ఎర్ర నేలల్లో మల్బరీ సాగు చేయవచ్చు. పట్టు పరిశ్రమలశాఖ ద్వారా ఒక ఎకరాలో మల్బరీసాగుకు రూ.22,500, పట్టు పురుగుల పంపకం గది నిర్మాణానికి రూ.3,37,500, రీలింగ్ పరికరాలకు రూ.56,250 చొప్పున ప్రభుత్వం రాయితీ అందిస్తుంది.

సమస్య: ఊజీ ఈగల బెడద అధికంగా ఉంది. నివారణకు ఉపయోగించే మందుల వల్ల పట్టు పురుగులకు నష్టం జరుగుతోంది. ఎలాంటి చర్యలు తీసుకోవాలి. **- ఆనంద్, రామగిరి మండలం, చిన్న కొండాపురం, కదిరిప్ప, కదిరి గ్రామీణ మండలం ముత్యాలచెరువు**

జేడీ: ఊజీ నివారణ కోసం నాశన్ ఫ్రేములు, ట్రాపులు మార్కెట్‌లో లభిస్తాయి. వీటిని వినియోగించడం వల్ల ఎటువంటి నష్టం జరగదు.

సమస్య: బైవోల్టిన్ పట్టు పరుగులు రోగాల వల్ల పంట నష్టం జరుగుతోంది. మల్బరీ ఎలాంటి చర్యలు తీసుకోవాలి. - రైతు రమేష్, పరిగి నాగరాజు, రైతు కృష్ణారెడ్డి, పెనుకొండ

జేడీ: అకులపై ఎర్రమచ్చ రాకుండా షెడ్‌లో తగు ఉష్ణోగ్రతలు, తేమ శాతం సరిచూసుకోవడమే కాకుండా 60 శాతం, ఆకు నాణ్యతపైన పంట దిడుబడి ఉంటుంది.

సమస్య: మల్బరీ సాగుకు మొక్కలు ఎక్కడ లభిస్తాయి. చిరునామా తెలియజేయండి. **- రైతు తిమ్మారెడ్డి, చెరువు వాండ్లపల్లి, నల్లమాడ మండలం**

జేడీ: రైతులకు అవసరమైన మల్బరీ మొక్కలు కదిరి సహాయసంచాలకుల కార్యాలయంలో నందు అందుబాటులో ఉన్నాయి.

సమస్య: పట్టు పరుగుల గది నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీలకు ఎంత రాయితీ అందిస్తారు. ఎలా దరఖాస్తు చేసుకోవాలి. **- వెంకట్రాముడు, మల్లెపల్లి**

జేడీ: పట్టు పురుగుల పెంపకానికి ఎస్టీ రైతులకు గది నిర్మాణానికి పరిశ్రమల శాఖ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రూ.4.05 లక్షలు రాయితీ అందించడం జరుగుతుంది. కళ్యాణదుర్గం పట్టు పరిశ్రమల శాఖ కార్యాలయంలో సంప్రదిస్తే, మంజూరు చేస్తారు.

సమస్య: పట్టు పురుగుల పెంపకపు గది నిర్మాణానికి సంబంధించి స్టేట్ షేర్, పడలేదు. రాయితీ నిధులు మంజూరు చేయండి. **- రైతు క్రిష్టప్ప, రొళ్ల, రైతు శ్రీనివాసులు, చిలమత్తూరు.**

జేడీ: కమిషనర్ పట్టు పరిశ్రమల శాఖ గుంటూరు స్టేట్ సెర్ నిధుల మంజూరు కోసం సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు సమర్పించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే, నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.

సమస్య: బైవోల్టిన్ పట్టు గూళ్లకు అందించే ప్రోత్సాహకాలు, పట్టు పరుగుల రోగ నిరోధన మందుల రాయితీలు మంజూరు కావడం లేదు. **- రైతు శ్రీనివాసులు, మడకశిర**

జేడీ: పట్టు పురుగల రోగ నిరోధక మందులు, రాయితీ నిధులు మంజూరు చేయడం జరిగింది. వారంలో రైతుల ఖాతాలకు జమ అవుతాయి.

సమస్య: బైవోల్టిన్ పట్టు గూళ్లకు అందించే రాయితీ ఇప్పటి వరకు మంజూరు చేయలేదు. ఖతాల్లో జమ చేయించండి.

- ఓరుగంటి శివ, చేబ్రోలు, శ్రీసత్యసాయి జిల్లా

జేడీ: ఈ ఆర్థిక సంవత్సరానికి మొదటి, రెండో క్వార్టర్‌లో పట్టుగూళ్ల ఉత్పత్తికి రైతుల ప్రోత్సాహక నిధులను ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. మొదటి క్వార్టర్‌కు సంబంధించిన బిల్లులు రెండ్రోజుల్లో జమ అవుతాయి.

సమస్య: పట్టు పురుగుల పెంపుగది, వరండా నిర్మాణానికి ఎలాంటి రాయితీ మంజూరు కాలేదు. మంజూరు చేయించండి. - సోమశేఖర్‌రెడ్డి, శెట్టిచిన్నంపల్లి, గోరంట్ల మండలం, రైతు కృష్ణవేణి, నిడిగల్లు, తాడిమర్రి మండలం

జేడీ: ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం మొదట విడత క్రింద నిధులు విడుదల చేసింది. త్వరలో రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.

తక్షణ స్పందన



మైలేపల్లిలో మల్బరీ సాగును పరిశీలించి రైతుకు సూచనలు ఇస్తున్న జేడీ

ఈ సందర్భంగా మైలేపల్లికి చెందిన రైతు చంద్రారెడ్డి చరవాణిలో జేడీకి తన సమస్యను వివరించారు. మల్బరీకి వస్తున్న తెగుళ్ల గురించి తెలిపారు. దీంతో ఆమె వెంటనే స్పందించారు. గ్రామానికి వెళ్లి మల్బరీ సాగును పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలపై అవగాహన కల్పించారు. తర్వాత పురుగుల పెంపకం బిల్లులు అందలేదని తెలియజేసిన రైతులకు ఖతాలు పరిశీలించారు. త్వరలో జమ అవుతాయని వివరించారు.



ఆసుపత్రిని సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ.బి.దేవి, డెమో ఉమాపతి

లావణ్య ఆసుపత్రి సీజ్

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. ఈ నెల 25న 'శస్త్ర చికిత్స వికటించి.. మహిళ పరిస్థితి విషమం', 26న 'నిబంధనలు చూడరు.. అనుమతులు ప్రశ్నించరు..' శీర్షికలతో వచ్చిన కథనాలకు కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. గురువారం అనంతపురం రామచంద్రానగర్‌లో ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ రమణానాయక్ నిర్వహిస్తున్న లావణ్య క్లినిక్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ.బి.దేవి పరిశీలించారు. క్లినిక్‌ను నిర్వహించేందుకు అనుమతి తీసుకుని శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు గుర్తించారు. లావణ్య ఆసుపత్రిని, శస్త్రచికిత్సలు చేస్తున్న ఆపరేషన్ థియేటర్‌ను సీజ్ చేశారు. విచారణ చేపట్టేందుకు వైద్యుల కమిటీని వేశామని, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గైనకాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ షంషాద్ బేగం, అనస్తీషియా విభాగం హెచ్‌వోడీ నవీన్‌కుమార్, యూరాలజీ విభాగం వైద్యుడు రంగస్వామి, జనరల్ సర్జన్ విభాగం వైద్యురాలు విజయలక్ష్మి విచారణ కమిటీలో ఉన్నారని తెలిపారు.

టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి కృషి



దుస్తుల తయారీని పరిశీలిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలోని టెక్స్‌టైల్ పార్కును రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళీ శాఖ మంత్రి ఎస్.సవిత గురువారం రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుతో కలిసి సందర్శించారు. కాలవ అధ్యక్షతన కార్మికులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. గార్మెంట్స్ రంగానికి పూర్వ వైభవం తీసుకురావాలని ఈ సందర్భంగా కాలవ కోరారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేను గార్మెంట్స్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. గార్మెంట్స్‌లో దుస్తుల తయారీని వారు పరిశీలించి కార్మికులు, యజమానులతో మాట్లాడారు. గడిచిన ఐదేళ్ల జగన్ ప్రభుత్వం చేనేత పరిశ్రమను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం త్వరలో నూతన టెక్స్‌టైల్ పాలసీ తీసుకురానుందని మంత్రి అన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుస్మిత, అనంతపురం హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్‌టైల్ ఏడీ శ్రీనివాసరెడ్డి, రాయదుర్గం గార్మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టంకశాల హనుమంతు, కార్యవర్గ సభ్యులు, కౌన్సిలర్లు ప్రశాంతి, తెదేపా మండల కన్వీనర్లు ఎంఆర్ఎఫ్ హనుమంతు, హనుమంతరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

హంద్రీనీవా ఎస్ఈ బదిలీ

హెచ్చెల్సీ ఉప ఎస్ఈ సైతం..

అనంతపురం (శ్రీనివాస్‌నగర్): జిల్లా జలవనరుల శాఖలో కీలక పోస్టుల్లో పని చేస్తున్న ఈఈలు బదిలీ అయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు గురువారం వెలువడ్డాయి. హంద్రీనీవా ఇన్‌ఛార్జి ఎస్ఈ దేసేనాయక్‌ను నెల్లూరు డ్రైనేజీ డివిజన్‌కు బదిలీ చేశారు. ఈయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. హెచ్చెల్సీ ఉప ఎస్ఈ సునీల్‌నాయక్‌ను తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు ఉపసీఈగా బదిలీ చేశారు. ఈయన స్థానంలోకి పోలవరం ప్రాజెక్టులో పని చేస్తున్న సూర్యభాస్కర్ శర్మను నియమించారు. చిన్ననీటి పారుదల (ఎంఐ) అనంత ఐబీ డివిజన్ ఈఈ సి.ప్రతాప్‌ను నంద్యాల కేసీ డివిజన్‌కు బదిలీ పొందారు. ఇక హెచ్చెల్సీలో కీలక లోకలైజేషన్ డివిజన్ ఈఈగా కర్నూలు ఎంఐలో పని చేస్తున్న ఆర్ఎస్ఆర్ పుల్లారెడ్డిని నియమించారు. ఈ స్థానంలో ఉన్న డీఈ రమణారెడ్డి ఇన్‌ఛార్జిగా పని చేస్తున్న సంగతి తెలిసిందే.

'రెవెన్యూ' బదిలీల్లో మార్పులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ శాఖలో కొన్ని కేడర్ల బదిలీలు మార్పులు జరిగాయి. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను గురువారం వెల్లడయ్యాయి. ఉప తహసీల్దార్లల్లో 19 మంది, ఎంఆర్ఐ/సీనియర్ సహాయకుల కేడర్‌లో 18 మంది చొప్పున బదిలీల స్థానాలు మార్పు జరిగాయి. సరిగ్గా ఐదు రోజుల క్రితం రెవెన్యూ శాఖలో 120 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తపరచడంతో కొన్ని కేడర్ల బదిలీల్లో మార్పులు జరిగినట్లు తెలుస్తోంది. సత్వరమే కొత్త స్థానాల్లో చేరాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

పరిశ్రమల శాఖ ఇన్‌ఛార్జి అధికారిగా రాజశేఖర్‌రెడ్డి

జిల్లా పరిశ్రమల శాఖ (డీఐసీ) ఇన్‌ఛార్జి అధికారిగా ఏడీ రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఇక్కడి డీడీ నాగరాజారావు గురువారం రిలీవ్ అయ్యారు. అనకాపల్లి నుంచి రెగ్యులర్ డీడీ రావాల్సి ఉంది. అప్పటి దాకా రాజశేఖర్‌రెడ్డినే బాధ్యతలు నిర్వర్తిస్తారు. కొత్త అధికారి అక్టోబరు 2 లేదా 3న బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

రాష్ట్ర సీనియర్ మహిళా ఫుట్‌బాల్ విజేత అనంతపురం

రన్నరప్‌గా శ్రీసత్యసాయి జిల్లా



అతిథుల నుంచి విన్నర్ ట్రోఫీ అందుకున్న అనంతపురం జట్టు



రన్నరప్ ట్రోఫీతో శ్రీసత్యసాయి జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : విజయవాడ శివారు కానూరులోని అనుమోలు ప్రభాకర్ గార్డెన్స్ మైదానంలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ మహిళల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. శ్రీ సత్యసాయి జిల్లా జట్టు రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. మూడో రోజైన గురువారం జరిగిన రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీ సత్యసాయి, కర్నూలు జట్లు తలపడ్డాయి. షూటౌట్స్‌లో శ్రీ సత్యసాయి జట్టు 5-3 గోల్స్ తేడాతో కర్నూలుపై విజయం సాధించి ఫైనల్‌లో ప్రవేశించింది. తృతీయ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు 2-0 గోల్స్ తేడాతో కర్నూలుపై గెలుపొందింది. సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం జట్టు 4-0 గోల్స్ తేడాతో శ్రీసత్యసాయి జిల్లా జట్టుపై విజయాన్ని నమోదు చేసుకుంది. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ముని శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా, కె.బాలకృష్ణ గౌరవ అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, వ్యక్తిగత పతకాలు బహూకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఎం.డానియేల్ ప్రదీప్, అనుమోలు ప్రభాకర్ జట్టు ఎంపిక కమిటీ సభ్యులు పి.ఆలీబాబా, ఎస్.అప్పారావు, కోనసీమ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వై.నీలాద్రి, రాష్ట్ర సంఘం కోశాధికారి వి.విజయ్‌కుమార్, మ్యాచ్ కమిషనర్ ఎండీ సిరాజుద్దీన్, ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, బి.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మరణంతో కుంగి..
కుమార్తె ఆత్మహత్య

కనగానపల్లి, న్యూస్‌టుడే: తండ్రి మరణంతో కుంగిపోయిన కుమార్తె మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. కనగానపల్లి గ్రామానికి చెందిన ఇందిర (40) కూడేరుకి చెందిన మలరాయుడుకి 18 సంవత్సరాల క్రితం ఇచ్చి వివాహం చేశారు. 8 సంవత్సరాల క్రితం భర్తను వదిలి తన తల్లిదండ్రుల వద్దనే ఉంటూ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేది. 3 నెలల క్రితం ఆమె తండ్రి కిష్టప్ప రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అప్పటినుంచి కుంగిపోయింది. కుటుంబ పెద్దను కోల్పోగా దిక్కుతోచని స్థితిలో ఉన్నవారికి ఆదరించేవారు లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంది. గురువారం తెల్లవారుజామున ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను కిందకు దించగా అప్పటికే మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేతను పోలీసులకు పట్టించిన స్థానికులు



పోలీసుల అదుపులో షామీర్

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి పట్టణం రైల్వేస్టేషన్ రోడ్డులో నివాసం ఉంటోన్న షామీర్, షబీనా దంపతులు ఇంట్లోనే గంజాయి విక్రయిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. ఒకటి, రెండుసార్లు హెచ్చరించినా వారిలో మార్పురాలేదు. గురువారం పిల్లల సాయంతో గంజాయిని అమ్ముతుండగా స్థానికులు అడ్డుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు రైల్వేస్టేషన్ రోడ్డుకు చేరుకుని షామీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నివాసాల మధ్య గంజాయిని విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్.ఎస్.రోడ్డువాసులు పోలీసులను కోరారు.

బాలికపై పెద్దనాన్న కుమారుడి అత్యాచారం

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే : పెద్దపప్పూరు మండలంలోని ఓ గ్రామంలో 13 ఏళ్ల బాలికపై పెద్దనాన్న కుమారుడు అత్యాచారం చేశాడు. ఈఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలిక తల్లిదండ్రులు ఆమె చిన్నతనంలో చనిపోయారు. అప్పటి నుంచి బాలిక వారి పెద్దనాన్న సంరక్షణలో ఉంటోంది. బాలిక వేరే మండలంలో ఎనిమిదో తరగతి చదువుతోందని, ఆమెను తీసుకురావడం, తీసుకెళ్లడం చేస్తుండేవాడు. ఈక్రమంలో కొన్ని రోజులుగా బాలిక దిగాలుగా ఉండటం గమనించిన ఉపాధ్యాయులు ఆరా తీశారు. బాలిక పెద్దనాన్న కుమారుడు తనపై చేసిన అఘాయిత్యాన్ని చెప్పింది. ఉపాధ్యాయులు పెద్దపప్పూరు పోలీసులకు సమాచారం అందించారు. బాలిక ఫిర్యాదుతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌస్‌బాషా తెలిపారు.

ఆటోను ఢీకొన్న జడ్పీ ఉపాధ్యక్షుడి వాహనం

ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం మండలం పోతుకుంట వద్ద జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి స్కార్పియో వాహనం ఆటోను ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న కుణుతూరు గ్రామానికి చెందిన జనార్దన్, యశ్వంత్‌రెడ్డి, అఖిలానందరెడ్డి గాయపడ్డారు. జనార్దన్‌కు తీవ్రగాయాలు తగిలాయి. క్షతగాత్రులను స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కామిరెడ్డిపల్లి నుంచి ధర్మవరానికి సుధాకర్‌రెడ్డి స్కార్పియో వాహనంలో వస్తుండగా ధర్మవరం నుంచి కుణుతూరు వెళుతున్న ఆటోను ఢీకొంది. స్కార్పియో వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. కరెంటు స్తంభం ఒకవైపు ఒరిగిపోయింది. ప్రమాద ఘటన అనంతరం అక్కడి నుంచి సుధాకర్‌రెడ్డి మరో వాహనంలో ధర్మవరం వెళ్లారు. గాయపడిన ముగ్గురిని ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన జనార్దన్ ఫిర్యాదు మేరకు ధర్మవరం గ్రామీణ పోలీసులు సుధాకర్‌రెడ్డి, డ్రైవర్ శ్రీకాంత్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు.

చీనీ చెట్ల నరికివేత

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే : మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో రైతు వెంకటలక్ష్మికి చెందిన నాలుగు నెలల వయస్సు ఉన్న 50 చీనీ చెట్లను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికేశారు. గురువారం ఉదయం పొలంలో పనులు చేసేందుకు వెంకటలక్ష్మి వెళ్లగా చెట్లను నరికివేసి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రామసుబ్బయ్య, ఎస్సై గౌస్‌బాషా పొలానికి వెళ్లి పరిశీలించారు. బాధిత రైతు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాయదుర్గం

• రాయదుర్గం • కళ్యాణదుర్గం • ఉరవకొండ



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచరులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

విడపనకల్(ఉరవకొండ), న్యూస్‌టుడే: ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న శ్రీనివాసులు, బాస్కర్‌ను గురువారం మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సన్మానించారు. వారి బోధన, పాఠశాల పట్ల నిబద్ధతతే అవార్డులు తెచ్చిపెట్టాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు సురేష్, నారాయణస్వామి, ఉపాధ్యాయులు మహేశ్వరప్ప, రాధ, రాధిక, కిశోర్, బాలముద్దన్న, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పగిలింది.. పల్లె గొంతెండుతోంది

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: బొమ్మనహాళ్ మండలంలో తాగునీటి పథకం పైప్‌లైన్ పగిలిపోయి ఎనిమిది నెలలవుతున్నా.. మరమ్మతులకు నోచుకోలేదు. ఫలితంగా ప్రజలు తాగునీటికి పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రధానంగా కొలగానహళ్లి, మైలాపురం, కృష్ణాపురం, లింగదహాళ్ గ్రామాల్లో సమస్య జటిలంగా మారింది. లింగదహాళ్-కృష్ణాపురం గ్రామాల మధ్య వ్యవసాయ పొలంలో పైప్‌లైన్ పగిలిపోయింది. ఆ పొలంలో వరి నాట్లు వేయడంతో మరమ్మతులకు వీలు లేకుండా ఉంది. మరో నాలుగు నెలలపాటు ప్రజలకు నీటి కష్టాలు తప్పవు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి తాగునీరందించాలని ప్రజలు కోరుతున్నారు. కల్లుదేవనహళ్లి, దర్గాహొన్నూరు, గోవిందవాడ తదితర గ్రామాల్లో శ్రీరామిరెడ్డి పథకం నీరు ఎప్పుడు వస్తాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఆయా గ్రామాల ప్రజలు హెచ్చెల్సీ, హగరి నీటిని తెచ్చుకుని దాహం తీర్చుకుంటున్నారు.

సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చైతన్యకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.



దర్గాహొన్నూరులో హెచ్చెల్సీ నీటిని బిందెలో నింపుకొంటున్న యువకుడు

పర్యాటక శోభ ఏదీ?

• ప్రాచుర్యం కోల్పోతున్న ప్రముఖ ఆలయాలు

రాయదుర్గం నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయటానికి ఎన్నో అవకాశాలు ఉన్నా.. ఆచరణకు నోచుకోవటం లేదు. ఫలితంగా ప్రముఖ ఆలయాలు, ఆశ్రమాలు, మఠాలు ప్రాచుర్యం కోల్పోతున్నాయి. సరైన రోడ్డు, రవాణా సౌకర్యం లేక భక్తులు, పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, అధికారులు ప్రణాళిక రూపొందించి పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

\- న్యూస్‌టుడే, రాయదుర్గం

దశభుజ గణపతి ఆలయ అభివృద్ధి దశాబ్దకాలంగా ప్రతిపాదనలకే పరిమితమైంది. జంబుకేశ్వరస్వామి, సంతాన వేణుగోపాలస్వామి ఆలయాలు, దుర్గం కొండపై ఉన్న యల్లమ్మ ఆలయం, కోదండ రామస్వామి ఆలయం, మాధవరాయ, వీరభద్ర స్వామి ఆలయాలకు, రససిద్ధుల గుట్టకు సరైన రోడ్డుసౌకర్యం లేక పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోవటం లేదు. ఆశ్రమాలది అదే పరిస్థితి. మెగా టూరిజం కింద అభివృద్ధి చేస్తామని గతంలో పర్యాటక శాఖాధికారులు పేర్కొన్నా.. ఆ తర్వాత తిరిగి చూడలేదు. భైరవానితిప్ప ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉన్నా పట్టించుకోవటం లేదు.



జైన విశ్వవిద్యాలయంలోని శిల్పాలు



ఆంజనేయస్వామి మూలవిరాట్టు



మురడి ఆంజనేయస్వామి ఆలయ గోపురం

వ్యాసరాయలు ప్రతిష్ఠించిన మహిమాన్విత మూడు ఆంజనేయస్వాముల్లో రెండు మురడి, నేమకల్లులో ఉన్నాయి. శ్రావణ మాసంలో వేల మంది భక్తులు స్వామివార్లను దర్శించుకుంటారు. ఆలయాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోవటం లేదు. నేమకల్లులో గదులు అధ్వాన స్థితికి చేరాయి. మూడు గోపురాల నిర్మాణాలు ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి. ఈ క్షేత్రాలకు ఆర్టీసీ సక్రమంగా బస్సులు నడపటం లేదనే ఆరోపణలున్నాయి. రోడ్లు అధ్వానంగా మారాయి. లింగాలబండలోని పశుపతి నాథుడి ఆలయం, డి.హీరేహాళ్ మండలంలోని గవి సిద్ధేశ్వర ఆలయాలకు సరైన రవాణా సౌకర్యం లేదు.

పెన్నహోబిలంలో అంతంతే..



పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ప్రసిద్ధిగాంచింది. ఇక్కడ జలపాతం, ఉగ్రనరసింహస్వామి విగ్రహం ఆకట్టుకుంటుంది. వారాంతాల్లో దాదాపు 5వేల మందికిపైగా పర్యాటకులు, భక్తులు వస్తుంటారు. గతంలోనే పర్యాటకశాఖకు ఆలయ అధికారులు 2.5 ఎకరాల భూమిని కేటాయించినా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదు. - న్యూస్‌టుడే, ఉరవకొండ

తగిన చర్యలు తీసుకుంటాం

నియోజకవర్గంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసి ప్రభుత్వ ఆదాయం పెంపునకు కృషి చేస్తాం. పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు, రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. - కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే

సత్ప్రవర్తనతో మెలగాలి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్ అన్నారు. గురువారం స్థానిక సబ్‌జైల్‌ను ఆయన తనిఖీ చేశారు. వంటశాల, విశ్రాంతి గదులు, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ మీరు చేసిన పొరపాట్ల వల్ల కుటుంబాలకు సమాజంలో గౌరవం ఉండదని ఖైదీలను ఉద్దేశించి అన్నారు. ఇక్కడి నుంచి బయటకు వెళ్లిన కష్టపడి పనులు చేసుకొంటూ కుటుంబాలతో సంతోషంగా గడపాలని సూచించారు. ఖైదీల యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ధనుంజయనాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిచక్రవర్తి, మాజీ అధ్యక్షుడు దేవేంద్ర, న్యాయవాదులు తిమ్మప్పచౌదరి, రామాంజనేయులు, ముత్యాలప్ప, సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్‌యాదవ్



మొలకెత్తని ఉల్లిపంట



విత్తన ప్యాకెట్లను చూపుతున్న రైతు ఖాసీం

నట్టేట ముంచిన నాసిరకం విత్తనాలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: నాసిరకం విత్తనాలతో ఉల్లి పంట మొలకెత్తక ఓ రైతు నష్టపోయారు. మండలంలోని మానిరేవు గ్రామానికి చెందిన రైతు ఖాశీం సర్వే నంబరు 491లో రెండెకరాల్లో ఉల్లి పంట సాగు చేశారు. ఈ నెల 2న అనంతపురంలోని ఓ దుకాణంలో కిలో విత్తనాలు రూ.1,550 చొప్పున 8 కిలోలు రూ. 12,400 వెచ్చించి కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు రూ.50 వేలు పెట్టుబడి పెట్టారు. విత్తు నాటి ఏడు రోజులైనా మొలకెత్తలేదు. విత్తన దుకాణ యజమానికి విషయం తెలుపగా పొలాన్ని పరిశీలించి, పంట వస్తుందని చెప్పి వెళ్లాడని రైతు తెలిపారు. నాసిరకం విత్తనాలతో నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. తన వద్ద విత్తనాలు కొనుగోలు చేసినట్లు రసీదు ఉందని, పరిహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతు కోరారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కంబదూరు, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. కంబదూరుకు చెందిన రాజన్న(62) పావగడ రహదారిలో నడుచుకుంటూ వెళ్తుండగా కర్ణాటక రాష్ట్రం బూపూరుకు చెందిన యువకుడు ద్విచక్రవాహనంలో అతి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. గాయపడిన వృద్ధుడిని కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

రాయదుర్గం గ్రామీణం: మండలంలోని వేపరాళ్ల గ్రామ సమీపంలో ఎరువులు లోడ్‌తో వెళ్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో కణేకల్లు మండలం కొత్తపల్లికి చెందిన తిప్పేస్వామికి రెండు కాళ్లు విరిగిపోయాయి. అనంతపురం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. డ్రైవర్ లారీని ఆపకుండా వెళ్లిపోయాడు. కణేకల్లు క్రాస్‌లో ప్రజలు సదరు లారీని పట్టుకున్నారు.

యువతి అదృశ్యంపై కేసు

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి(19) బుధవారం అర్ధరాత్రి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇరుగు, పొరుగు వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభ్యం కాలేదన్నారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎద్దులబండి దూసుకెళ్లి వృద్ధురాలికి గాయాలు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని ఉంతకల్లు గ్రామంలో కె.పెద్దభీమక్క అనే వృద్ధురాలిపై ఎద్దుల బండి దూసుకెళ్లి తీవ్రంగా గాయపడ్డారు. బాధితురాలి కుమారుడు శంకర్ గురువారం బొమ్మనహాళ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమెను బళ్లారి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆమె కుమారుడు తెలిపారు.

చౌక దుకాణం సీజ్

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని హులికల్లులోని 34వ చౌకధాన్యం డిపోలో నిల్వలు తక్కువగా ఉండటంతో సీజ్ చేసినట్లు పౌరసరఫరాల శాఖ ఉప తహసీల్దారు సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం వీఆర్వో రమేష్‌తో కలిసి తనిఖీ చేశారు. డిపోలో రెండున్నర క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నాయని, దస్త్రాలు సక్రమంగా లేకపోవడంతో సీజ్ చేశామని తెలిపారు.

దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం

\- మంత్రి సవిత

కణేకల్లు: దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తామని బీసీ సంక్షేమం, జౌళి శాఖా మంత్రి సవిత అన్నారు. కణేకల్లులో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. తెదేపా నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. రూ.72 లక్షల ఉపాధి నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. బీసీల అభ్యున్నతికి కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు నిధులు ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. ఎమ్మెల్యే కాలవ మాట్లాడుతూ రూ.40కోట్లతో చేపట్టే కణేకల్లు హగరిపై ర.భ వంతెన పనులకు దసరాకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మరో రూ.8కోట్లు అదనంగా నిధులు మంజూరు చేయించి వంతెనను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచి నిర్మల, తెదేపా మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు ఆనందరాజు, మరియప్ప, చంద్రశేఖర గుప్తా, రమేశ్, చాంద్, మల్లికార్జున, బసవరాజు, నాగార్జున, వన్నారెడ్డి, జయరాం చౌదరి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీ పాఠశాల నిర్మాణానికి రూ.22.5 కోట్లు మంజూరు

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి ఎంజేపీ పాఠశాల నిర్మాణానికి రూ22.5 కోట్లు మంజూరు చేశారని, వెంటనే పనులు చేపట్టి నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి సవిత పేర్కొన్నారు. గురువారం ఆమె ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, సిబ్బందితో కలిసి గోనబావి వద్ద అర్ధాంతరంగా ఆగిన మహాత్మాగాంధీ జ్యోతిరావు పులె బాలికల గురుకుల పాఠశాల నిర్మాణాలను పరిశీలించారు. ఆతర్వాత గుమ్మఘట్టలోని పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో వెల్ఫేర్ డీఈ రమణారెడ్డి, ఏఈ రాజశేఖర్ రెడ్డి, కన్వీనర్ సంగీత కుమారి, గుత్తేదారు రావూరు రమేష్, కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, కేపీదొడ్డి నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కణేకల్లు: ప్రసంగిస్తున్న మంత్రి సవిత, వేదికపై ఎమ్మెల్యే కాలవ తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: కుందుర్పి మండలం కరిగానిపల్లిలో మురుగు గుంతను పూడ్చాలి. **- గ్రామస్థులు**

సమాధానం: తగిన చర్యలు తీసుకుంటాం. **- లక్ష్మీనరసింహ, ఎంపీడీఓ**

సమస్య: బండమీదపల్లిలో పాత పాఠశాల వద్ద పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రత నెలకొంది. **- నాగరాజు**

సమాధానం: శుభ్రం చేయిస్తాం. **- మహబూబ్ బాషా, గ్రామ కార్యదర్శి**

సమస్య: తెనగల్లులో అంగన్‌వాడీ కేంద్రం వద్ద ముళ్ల కంపలను తొలగించాలి. **- కాలనీవాసులు**

సమాధానం: తొలగించేస్తాం. **- వనజాఅక్కమ్మ, సీడీపీఓ**

- న్యూస్‌టుడే, కుందుర్పి

స్తంభాన్ని సరిచేశారు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: మండలకేంద్రంలోని మారెమ్మ ఆలయ సమీపంలో ఒరిగిపోయి ప్రమాదకరంగా మారిన విద్యుత్తు స్తంభాన్ని గురువారం ఆశాఖ అధికారులు సరిచేశారు. ఈ నెల 20న విద్యుత్తు స్తంభం... ప్రమాదకరం శీర్షికన 'ఈనాడు'లో వార్త ప్రచురితం అయ్యింది. స్పందించిన అధికారులు స్తంభాన్ని సరిచేశారు.

ఎంపీపీ బాధ్యతల స్వీకరణ

కణేకల్లు, న్యూస్‌టుడే: కణేకల్లు ఎంపీపీగా లీలావతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ఎంపీపీ పదవితో పాటు వైకాపా ఎంపీటీసీ స్థానానికి సంధ్య సాధారణ ఎన్నికలకు ముందే రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కొన్ని నెలలుగా ఎంపీపీ స్థానం ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో వైస్ ఎంపీపీగా కొనసాగుతున్న లీలావతికి ఉన్నతాధికారులు ఎంపీపీ బాధ్యతలు అప్పగించారు.

పీఆర్ డీఈఈ..: ఉరవకొండ: ఉరవకొండ పంచాయతీరాజ్ డివిజన్ డీఈఈగా మహమ్మద్ రసూల్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అనంతపురం పీఆర్ఐ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఐదు మండలాల ఏఈఈలు, ఇతరులు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా లోకానంద

రాయదుర్గం, న్యూస్‌టుడే: మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పట్టణానికి చెందిన న్యాయవాది జి.లోకానందను నియమిస్తూ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల19వ తేది ఆయనను నియమిస్తూ కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు.

పన్ను వసూలుకు చర్యలు తీసుకోండి


రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలో మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు, అభివృద్ధి పనుల అమలుకు ఆస్తి, ఖాళీ స్థలాలు, నీటి పన్నుల వసూళ్లకు వార్డు అడ్మిన్లు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ సూచించారు. కళ్యాణదుర్గం నుంచి రాయదుర్గంకు బదిలీ అయిన ఆర్ఐ.సత్యనారాయణను వార్డు అడ్మిన్ కార్యదర్శులు గురువారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. రెవెన్యూ అధికారి కొండన్న పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రాణ సంకటం



బొమ్మనహాళ్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వ్యవసాయ కూలీలు వేరుసెనగ, మొక్కజొన్నల యంత్రాలపై కూర్చొని ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్నారు. దర్గాహొన్నూరు, గోవిందవాడ, తారకాపురం తదితర గ్రామాల్లో బోర్ల కింద సాగు చేసిన మొక్కజొన్న, వేరుసెనగ కోతలు కోస్తున్నారు. పొలాల్లో పనులకు వెళ్లిన కూలీలు యంత్రాలపైనే కూర్చొని ఇళ్లకు వస్తున్నారు. ఏమాత్రం పట్టు జారితే కింద పడి ప్రాణాలు పోయే పరిస్థితి ఉంది. పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, బొమ్మనహాళ్

కోనేరు.. కన్నెత్తి చూడరు



పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లోని కోనేరులో గుర్రపుడెక్క పెరిగి భక్తులు స్నానాలు చేసేందుకు వీలు లేని పరిస్థితి నెలకొంది. ఉద్భవలక్ష్మి అమ్మవారి ఆలయానికి వారానికి సుమారు 2వేల మంది వరకు భక్తులు వస్తుంటారు. శ్రీవారు, అమ్మవారి దర్శనం తరువాత కోనేరులో స్నానం చేస్తారు. కొన్నేళ్లుగా శుభ్రం చేయక పోవడంతో గుర్రపు డెక్క పెరిగి పచ్చగా మారింది. అధికారులు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. దీన్ని ఆలయ ఈవో విజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా కోనేరు ఆధునికీకరణకు ప్రతిపాదనలు పంపామన్నారు.

\- న్యూస్‌టుడే, ఉరవకొండ

ఉపాధ్యాయుల మధ్య విభేదాలు

• బోధనలో ఆటంకంపై ఆందోళన

రాయదుర్గం: విద్యార్థులకు సఖ్యతపై పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తుండటంతో విద్యార్థుల చదువులు గాలిలో దీపంలా మారాయని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని ముత్రాసి కాలనీ పాఠశాలలో వన్నూరుస్వామి, రామకృష్ణ అనే ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వారిలో గురువారం ఉదయం ఒక ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లగా మరొకరు తనకు కూడా వ్యక్తిగత పనులు ఉన్నాయని సెలవు మంజూరు చేయాలని ఎంఈవో కార్యాలయానికి వెళ్లారు. పాఠశాలలో ఉపాధ్యాయులు ఎవరూ లేకపోవటంతో విద్యార్థులు రోడ్డుపైకి చేరారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని ఆందోళన చేశారు. ఎంఈవో నాగమణికి సమాచారం అందించగా ఉపాధ్యాయులను హెచ్చరించి పాఠశాలకు పంపించారు. బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. వారిద్దరిని ఇతర పాఠశాలలకు పంపించి కొత్త వారిని నియమిస్తామన్నారు.

'అన్ని వేళలా అండగా ఉంటాం'

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వానికి అన్ని వేళలా అండగా ఉంటామని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల అన్నారు. గురువారం రాయదుర్గం ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీలు వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ.50వేల నగదును జిల్లా కమిటీకు అందించారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

రాయదుర్గం, న్యూస్‌టుడే: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మున్సిపల్ ఛైర్ పర్సన్ పొరాళు శిల్ప అన్నారు. గురువారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక కూనా నాగప్ప సుంకమ్మ పాఠశాల, పోలీసు స్టేషన్ ఎదురుగా మొక్కలు నాటారు. బళ్లారి రోడ్డు సంత మార్కెట్‌లో చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు, తెదేపా నాయకులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు. **కళ్యాణదుర్గం:** పర్యావరణాన్ని రక్షించుకుని కరవును పూర్తిగా పారద్రోలుదామని పర్యావరణవేత్త రాజయోగి భాస్కర్‌నాయుడు పిలుపునిచ్చారు. గురువారం కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయుడు జగన్నాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

బొమ్మనహాళ్: గోవిందవాడ ఉన్నతపాఠశాలలో సింధిటి కంపెనీ మేనేజర్ అన్వర్, తెదేపా మండల నాయకుడు సోమనాథ్ గౌడ్, హెచ్ఎం రాజసూరీడు తదితరులు మొక్కలు నాటారు.



మొక్క నాటి నీరు పోస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శివ

ముగిసిన హర్యాలీ తీజ్ ఉత్సవాలు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: మండలంలోని రూపానాయక్ తండా(వెంకటాంపల్లి పెద్ద తండా) గ్రామస్థులు 11రోజులపాటు నిర్వహించిన హర్యాలీ తీజ్ ఉత్సవాలు గురువారం ముగిశాయి. బంజారా యువతులు నృత్యాలు చేస్తూ వెంకటాంపల్లి సమీపంలోని బావిలో గోధుమ గడ్డి వెదురు బుట్టలను నిమజ్జనం చేశారు.



మహిళల సందడి

చిరుతల సంచారం

డి.హీరేహాళ్(రాయదుర్గం పట్టణం): కల్యం గ్రామంలో గురువారం చిరుత సంచారంతో గ్రామస్థులు భయాందోళన చెందారు. సమీపంలోని కొండపై చిరుత కూర్చుని ఉండగా కొందరు యువకులు గమనించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. వారం రోజులుగా చిరుత సంచరిస్తుందని, బయటకు రావాలంటేనే భయంగా ఉందని గ్రామస్థులు తెలిపారు.

కళ్యాణదుర్గం గ్రామీణం: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి గ్రామంలో చిరుతల సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఓ ప్రైవేట్ పాఠశాల పక్కనే ఉన్న కొండలో మూడు చిరుతలు ఉన్నాయని, పగలు బయటకు వస్తున్నాయని పలువురు తెలిపారు.

నిరుద్యోగులకు బాసట

• వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ



అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో శిక్షణకు హాజరైన నిరుద్యోగులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఎంతో మంది యువత డిగ్రీ.. ఆపై కోర్సులు చదివి నైపుణ్యంపై అవగాహన లేక ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు దూరంగా ఉంటున్నారు. అటువంటి వారికి ప్రభుత్వం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇస్తున్న ఉచిత శిక్షణ ఉపకరిస్తోంది. ఉరవకొండ మండలం చిన్న ముష్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ 2023 నుంచి వివిధ కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు ఏపీఎస్ఎస్‌డీసీ, ఎన్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నాలుగు బృందాలకు శిక్షణ ఇచ్చారు. వాటిలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులో 30 మంది శిక్షణ పొందితే 20 మందికి, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు 50 మంది శిక్షణ పొందితే 32 మంది ప్రైవేటు రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందారు. ప్రస్తుతం రెండు బృందాల్లో 62 మందికి డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ సర్వేయరు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ ముగిశాక పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి ధ్రువపత్రాలు అందిస్తారు.

ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం



నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా శిక్షణ ఇస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల యువకులు వివిధ కోర్సుల్లో చేరి నైపుణ్యం పెంచుకుంటున్నారు. ఎప్పటికప్పుడు కొత్త మెలకువలు నేర్పుతున్నాం.

\- జయలక్ష్మి, స్కిల్‌హబ్, సమన్వయకర్త

అన్ని అంశాలు నేర్చుకుంటున్నా..



డిగ్రీ పూర్తి చేశాను. శిక్షణ గురించి తెలుసుకుని, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో చేరాను. అన్ని అంశాలు నేర్చుకుంటున్నా. ఉద్యోగం సాధిస్తాననే ధైర్యం కలుగుతోంది.

\- లక్ష్మి, ఉరవకొండ

సర్వే కోర్సుపై అవగాహన



ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో డ్రెస్ మేకింగ్ కోర్సు పూర్తి చేశాను. సర్వేయింగ్ నేర్చుకోవాలని ఆసక్తి ఉండేది. శిక్షణ గురించి తెలుసుకుని అసిస్టెంటు సర్వేయరు కోర్సులో చేరాను. పూర్తయిన తరువాత నిర్మాణ రంగంలో లేదా సర్వే సంబంధ పనుల్లో ఉపాధి పొందేందుకు మార్గం ఏర్పడింది. - మహాలక్ష్మి, ఉరవకొండ

సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ నిరుద్యోగులకు వరం లాంటిది. తాజాగా కళాశాలలో నిర్వహించిన ఉద్యోగ మేళాలో 40 మంది ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఒక్కోసారి ఒక్కో కోర్సులో శిక్షణ ఇస్తున్నారు. యువకులు సద్వినియోగం చేసుకునేలా చూస్తున్నాం. - అష్రఫ్‌అలీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

వజ్రకరూరు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు కొనకొండ్ల బాలుర గురుకుల పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ జోనాథన్ తెలిపారు. అక్టోబర్ 2నుంచి 5 వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. **కళ్యాణదుర్గం గ్రామీణం:** చాపిరి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న జి.శ్రీహరి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరసింహప్ప, వ్యాయామ ఉపాధ్యాయుడు మురళి తెలిపారు.



వజ్రకరూరు: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి



ఇలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

వీరవనిత ఇలమ్మకు నివాళి

తాడిపత్రి, న్యూస్‌టుడే : బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పోరాడిన వీరవనిత ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ కూడలిలో సీపీఐ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రంగయ్య, రజక సంఘం నాయకులు శ్రీరాములు, సూరి, చిరంజీవి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన వారితో ఉపాధ్యాయులు

యాడికి, న్యూస్‌టుడే : యాడికి పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు చెస్‌లో ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజన్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. నియోజకవర్గంలో జరిగిన అండర్-17 విభాగంలో ఎం.లహరి, ఎస్.దీపిక మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచి జిల్లాస్థాయిలో అవకాశం దక్కించుకున్నారు. ప్రతిభకు మెచ్చి విద్యార్థినులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

పెనకచెర్ల ఆరోగ్య ఉప కేంద్రం సేవలకు గుర్తింపు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని పెనకచెర్ల హెల్త్, వెల్‌నెస్ కేంద్రానికి కేంద్ర నాణ్యతా సేవల ప్రమాణాల కమిటీ గురువారం అర్హత పత్రం మంజూరు చేసినట్లు మండల వైద్యులు గౌతమి, హనీష, దిలీప్‌కుమార్ తెలిపారు. ఆగస్టు 17న తనిఖీ నిమిత్తం వచ్చిన అధికారులు హెల్త్, వెల్‌నెస్ కేంద్రం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రజలతో ఆరా తీశారు. అనంతరం అర్హత పత్రాన్ని ఇచ్చినట్లు వారు వివరించారు. సెంటర్‌లోని కమ్యూనిటీ హెల్త్ అధికారిణి అరుణజ్యోతి, ఏఎన్ఎం దుర్గాభవాని, హెల్త్ అసిస్టెంట్ శివయ్య, ఆశాకార్యకర్తలను వైద్యాధికారులు అభినందించారు.

కంప్యూటర్ బోధకుడిపై విచారణ

యల్లనూరు, న్యూస్‌టుడే : చిలమకూరు వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని విధుల నుంచి బహిష్కరించ బడిన కంప్యూటర్ బోధన శిక్షకుడు భాస్కర్ నాయక్‌పై గురువారం ఉన్నతాధికారులు విచారణను కొనసాగించారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారిణి శ్రీదేవి, వాణిదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పుట్లూరు, న్యూస్‌టుడే : సంజీవపురం గ్రామానికి చెందిన కాకర్ల హరినాథరెడ్డి (25) గురువారం తెల్లవారుజామున దిల్లీ పరిసర ప్రాంతంలోని గుర్గావ్ సమీపంలో బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హరినాథరెడ్డి జెన్‌కో కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. స్వగ్రామంలోని తల్లిదండ్రులు కాకర్ల నాగమునిరెడ్డి, లక్ష్మీదేవి, అతని సోదరుడు లోకనాథరెడ్డిల రోదనలు మిన్నంటాయి. ఈఘటనపై సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

గార్లదిన్నె, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను గురువారం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పామిడి పెన్నానది నుంచి రెండు ఇసుక టిప్పర్లను అనంతపురం వైపు తీసుకెళ్తుండగా కల్లూరు వద్ద ఉన్న జాతీయ రహదారిపై శింగనమల సీఐ కౌలుట్లయ్య పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఇసుక టిప్పర్లతో పాటు మట్టిని అనంతపురం తరలిస్తున్న మరో టిప్పరును జప్తు చేసినట్లు చెప్పారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: నాగసముద్రం గ్రామంలో నీటి సరఫరా విషయమై జరిగిన ఘర్షణలో ఇద్దరి కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప తెలిపారు. గ్రామంలో ఎమ్మెల్యే పర్యటనకు ముందు నీరు వదలాలని తెదేపా నాయకులు రమేష్, సురేంద్రలు గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డిని నీటిని కోరారు. వెంటనే కార్యదర్శి నీటిని సరఫరా కార్మికుడు, వైకాపా మద్దతుదారుడు రాంబాబుకు నీరు వదలాలని సూచించారు. ఈవిషయంలో తాను వదలని, తెదేపా వారే తన వద్దకు వచ్చి అడగాలని చెప్పాడు. దీంతో రాంబాబుకు తెదేపా నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో వైకాపా మద్దతుదారుడు రాంబాబు, సర్పంచి భర్త నరసింహులు తమ దాడి చేశారని తెదేపా నాయకులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో..

గార్లదిన్నె గ్రామీణం : కల్లూరు గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇద్దరు ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌస్‌బాషా తెలిపారు. శింగనమల మండలం తరిమెల రోడ్డు వైపు నుంచి ఇసుకను తరలిస్తుండగా సమాచారం అందడంతో గురువారం ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పన్నారు. అనుమానితుల వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

పల్లె ప్రగతికి అడుగులు

● ఊరూరా సీసీ రోడ్ల నిర్మాణాలకు కసరత్తు

● రూ.కోట్ల నిధుల కేటాయింపు





శింగనమలలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకం

నార్పల(శింగనమల), న్యూస్‌టుడే : వైకాపా ఐదేళ్ల పాలనలో పల్లెల ప్రగతికి పట్టిన పీడ వీడింది. గ్రామాల్లోని సమస్యలను వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే గ్రామీణ అభివృద్ధికి అడుగులు వేస్తోంది. పల్లె ప్రగతి కోసం సీసీ రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. శింగనమల నియోజకవర్గంలోని 116 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలను చేపట్టనున్నారు. గ్రామాలను అందంగా ఉంచేందుకు పనులు చేపడుతోంది. ఇళ్ల ముందు, వీధుల్లోనూ ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకొని సీసీ రోడ్లను వేయనున్నారు. మురుగు నీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇళ్ల ముందుకు మురుగు సమస్య లేకుండా డ్రైనేజీల ఏర్పాటుకు నిధులు విడుదల చేసింది. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.18.50 కోట్లు మంజూరు చేశారు. గ్రామాల్లో సీసీ రోడ్లు ఎక్కడ అవసరం ఉంటే అక్కడ వేయనున్నారు.

● శింగనమల మండలం ఆకులేడు- నాగులగుడ్డం గ్రామాలకు వెళ్లే రహదారి శిథిలమైంది. ఐదేళ్లుగా ఈ రోడ్డుపై ప్రయాణం చేయలేక పోతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఎక్కడ పడితే అక్కడ గుంతలు పడ్డాయంటున్నారు. రాత్రిళ్లు గుంతలు కనిపించక ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగాయి. అధికారులు స్పందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పనులు చేపడతాం

గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులను గుర్తించాము. త్వరలోనే గ్రామాల్లో పనులు చేపడతాము.

- నిర్మలకుమారి, ఎంపీడీవో, శింగనమల

మండలాల వారీగా నిధుల కేటాయింపు (రూ.కోట్లలో)

మండలం	నిధులు	మండలం	నిధులు
శింగనమల	రూ. 2.80	నార్పల	రూ. 3.50
బుక్కరాయసముద్రం	రూ. 4.20	పుట్లూరు	రూ. 2.30
గార్లదిన్నె	రూ. 3.40	యల్లనూరు	రూ. 2.30

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య : ఓబుళాపురంలో పలు చోట్ల వీధిదీపాలు వెలగడం లేదు.
- పెన్నోబులేసు, ఓబుళాపురం
సమాధానం: వీధిదీపాలు ఏర్పాటు చేయిస్తాం. **- సూర్యనారాయణ, సర్పంచి** **–న్యూస్‌టుడే, పామిడి**



సమస్య: గుంతకల్లులోని డీఎంఎం రైలు గేటు వద్ద రోడ్డు సరిగా లేక పోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. **- కృష్ణ, వాహన చోదకుడు**
సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం **- హరికృష్ణ, ఏఈ** **–న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం**

సమస్య : శివపురం ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు.
- పెద్దన్న, శివపురం
సమస్య : ఆనందరావుపేటలో వీధి దీపాలు లేవు.
- ఆదినారాయణ, ఆనందరావుపేట
సమాధానం : త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం.
- నిర్మలకుమారి, ఎంపీడీవో **–న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం**

గుంతల దారిని బాగు చేయండి

నార్పల (శింగనమల), న్యూస్‌టుడే : శింగనమల మండలం ఆకులేడు- నాగులగుడ్డం గ్రామాలకు వెళ్లే రహదారి శిథిలమైంది. ఐదేళ్లుగా ఈ రోడ్డుపై ప్రయాణం చేయలేక పోతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఎక్కడ పడితే అక్కడ గుంతలు పడ్డాయంటున్నారు. రాత్రిళ్లు గుంతలు కనిపించక ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగాయి. అధికారులు స్పందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



దిమ్మెలు కట్టారు.. నియంత్రికలు మరిచారు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నియంత్రికలేని దిమ్మె

గుత్తి, న్యూస్‌టుడే : విద్యుత్తుశాఖ అధికారులు గుత్తి పురపాలికలోని పలువార్డుల్లో అదనపు నియంత్రికలను ఏర్పాటు చేయాలని గుత్తేదారుడితో ఏడాది కిందట దిమ్మెలు నిర్మించారు. ఒక్కో దిమ్మెకు రూ.13,500 చెల్లిస్తామని అధికారులు ఆగమేఘాలపై నిర్మించారు. చెట్నేపల్లిలో అల్పవిద్యుత్తు సమస్యను తీర్చాలన్న ఉద్దేశంతో రెండేళ్ల కిందట ఉన్నతాధికారులు 100 కేవీ నియంత్రికను మంజూరు చేశారు. ఇప్పటికీ నియంత్రికను ఏర్పాటు చేయలేదు.

క్షేత్రస్థాయిలో ఎక్కడెక్కడంటే?

అనంతపురం రోడ్డులోని బండల పాలిషింగ్ కేంద్రం వద్ద నియంత్రికను ఏర్పాటు చేసేందుకు గుత్తేదారుడు బాలరాజుతో ఏడాది దిమ్మె కిందట నిర్మించారు. ఇప్పటి వరకు అతీగతీ లేదు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, సీపీఐ కాలనీ వద్దా ఇదే పరిస్థితి ఉంది. తురకపల్లిరోడ్డులో కూడా నియంత్రిక మార్పుకోసం దిమ్మెను కట్టించి వదిలేశారు. ఇదంతా గత వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగింది. కుమ్మరగేరిలో కూడా అదనపు విద్యుత్తు నియంత్రిక ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఫలితంగా అల్పవిద్యుత్తుతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయంపై ఏడీఈ సాయిశంకర్‌ను వివరణ కోరగా త్వరలోనే నియంత్రికలను ఏర్పాటు చేస్తామన్నారు.

గంజాయిపై యుద్ధం : జేసీ



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, న్యూస్‌టుడే: గంజాయి జీవితాలనే సర్వనాశనం చేస్తుందని, తాడిపత్రిలో ఎక్కడా గంజాయి కనపడకూడదని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో నుంచి సామాజిక మాధ్యమాల్లో జేసీ మాట్లాడారు. ప్రస్తుతం అనేకమంది యువకులు గంజాయికి బానిసలై జీవితాలనే నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. పది నిమిషాల ఆనందం కోసం నిండు జీవితాన్ని కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాడిపత్రిలో గంజాయి అమ్మేవారిపై పోలీసులతో పీడీ యాక్టు కేసు నమోదు చేయించి బహిష్కరిస్తామని తెలిపారు. త్వరలోనే తాను తాడిపత్రికి వస్తానని, వచ్చిన వెంటనే గంజాయి నిర్మూలనకు యుద్ధం ప్రకటిస్తామన్నారు.

'హిందువుల మనోభావాలు దెబ్బతింటున్నాయి'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్

గుంతకల్లు, న్యూస్‌టుడే : తిరుమలలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లే భక్తులకు వైకాపా ప్రభుత్వం కల్తీ లడ్డూలను అందజేసి వారి మనోభావాలను దెబ్బతీసిందని గుంతకల్లు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ అన్నారు. స్థానిక ఇల్లూరు లక్ష్మీనారాయణ సభా మందిరంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్తీ లడ్డూ గురించి కొన్ని రాజకీయ పార్టీల వారు నోరుమెదపడం లేదని విమర్శించారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవడానికి జనసేన నాయకుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దీక్ష చేపట్టడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. పవన్ కల్యాణ్‌కు మద్దతుగా గుంతకల్లులో 29న భారీ ప్రదర్శనను నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. యువమోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి మంజులా వెంకటేశ్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా జగదీశ్, జనసేన నాయకుడు బండి శేఖర్, భాజపా నాయకులు కేశవ, శ్రీదేవి, ఉమారాణి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు తోడ్పాటు

గుంతకల్లు: ట్రాఫిక్ నియంత్రణకు గుంతకల్లుకు చెందిన క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ బ్యాంకు అధికారులు తోడ్పాటు అందించినందుకు చాలా సంతోషంగా ఉందని ఒకటో పట్టణ సీఐ మనోహర్ అన్నారు. బ్యాంకు అధికారులు రూ. 30 వేలకు పైన విలువచేసే ట్రాఫిక్ నియంత్రణ బారికేడ్లను గురువారం పోలీసు స్టేషన్‌కు తరలించి సీఐకు అందజేశారు. బ్యాంకు ప్రాంతీయ మేనేజరు గౌస్‌పీర్, మేనేజర్లు గంగాధర్ స్వామి, పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన పిల్లలు

గుంతకల్లు, న్యూస్‌టుడే : ఇంటినుంచి పారిపోయి వచ్చిన ఇరువురు బాలురను పట్టుకుని గురువారం వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు గుంతకల్లు రైల్వే రక్షణదళం సీఐ వసంతరావ్ తెలిపారు. సికింద్రాబాద్‌లోని నాచారానికి చెందిన యోనా, విజయకుమార్ రైలులో గోవాకు వెళ్తుండగా గుంతకల్లు ఆర్పీఎఫ్‌లకు సమాచారం అందింది. రైలులో ఉన్న ఆ ఇద్దర్ని గుంతకల్లులో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. తల్లిదండ్రుల సమాచారాన్ని తెలుసుకుని అప్పగించారని సీఐ తెలిపారు.

'హామీలన్నీ నెరవేరుస్తాం'

గుంతకల్లు, న్యూస్‌టుడే : ఎన్నికల సమయంలో తెదేపా ఇచ్చిన హామీలను ప్రభుత్వం తప్పక నెరవేరుస్తుందని తెదేపా నాయకుడు నారాయణస్వామి, పట్టణ అధ్యక్షుడు ఆనంద్, తెదేపా వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు హిమబిందు, జనసేన నాయకుడు పూలరమణ పేర్కొన్నారు. శ్యాంసోన్‌పురంలో గురువారం జరిగిన సభలో వారు ప్రసంగించారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ కృష్ణారెడ్డి, తెదేపా నాయకులు మస్తాన్‌యాదవ్, అంజి, శివన్న, వెంకటేశులు, మస్తానప్ప, అంజనేయులు, కృపాకర్ పాల్గొన్నారు.

కసాపురంలో పునర్వసు నక్షత్ర పూజలు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని సీతారామచంద్ర స్వామి ఉత్సమూర్తులకు తిరుమంజన స్నపనం వంటి పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. యాగశాలలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.



పూజలందుకున్న సీతారామచంద్ర స్వామి ఉత్సమూర్తులు

అధ్వానంగా అంగన్‌వాడీ కేంద్రం

వెంకటాంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్లోరింగ్ పనులు సక్రమంగా చేయలేదు. దీంతో టైల్స్ అన్నీ పగిలిపోయాయి. కేంద్రంలో దాదాపుగా 30 మంది వరకు పిల్లలు ఉన్నారు. ఇక్కడి పరిస్థితి కారణంగా వారంతా ఇబ్బంది పడుతున్నారు. దీనిపై నాగసముద్రం సెక్టార్ సూపర్‌వైజర్ స్పందిస్తూ ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. **–న్యూస్‌టుడే, గుంతకల్లు గ్రామీణం**



రాష్ట్రానికి మంచి రోజులు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. గురువారం గుత్తి మండలంలోని జక్కలచెరువు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే 11 మహిళా స్వయం సహాయక సంఘాల్లో ఉన్న 28 మంది సభ్యులకు రూ.14 లక్షల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు, తెదేపా నాయకులు గుమ్మనూరు నారాయణ, ఈశ్వర్, పత్తి హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.



గుత్తి గ్రామీణ : సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, వెంకటశివుడు యాదవ్

జోరుగా అభివృద్ధి పనులు

బుక్కరాయసముద్రం : తెదేపా, జనసేన, భాజపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయని, రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. గురువారం ఆమె బుక్కరాయసముద్రం పంచాయతీ జనచైతన్య కాలనీలో నూతన సీసీ రహదారుల ఏర్పాటు పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం హమాలీకాలనీ వద్ద ఏర్పాటు చేసిన సభావేదిక వద్ద గ్రామ పంచాయతీకి మూడు ట్రాక్టర్లను పంపిణీ చేశారు. డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.62 లక్షల రుణాలు పంపిణీ చేశారు. తెదేపా జిల్లా నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, హనుమంతరెడ్డి, తహసీల్దారు పుణ్యవతి, ఎంపీడీవో తేజోత్స్న పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న తెదేపా నాయకులు

స్వచ్ఛందంగా యువకుల రక్తదానం



అంబికా వీక్షిత్‌కు కేకు తినిపిస్తున్న అభిమానులు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కుమారుడు వీక్షిత్ పుట్టినరోజు సందర్భంగా తెదేపా, జనసేన కార్యకర్తలు అభిమానులు బుక్కరాయసముద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా వీక్షిత్‌తో కలిసి కేకును కత్తిరించి శుభాకాంక్షలు తెలిపారు. యువత స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. అనంతరం వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జనసేన మండల కార్యదర్శి ఎర్రిస్వామి, ఎర్రిస్వామి, మునిరాజ్, ధనా, కామేష్, సాయి పాల్గొన్నారు.

మురుగు పరుగు.. పట్టించుకునేదెవరు?

● నార్పల మేజర్ పంచాయతీ నడిబొడ్డున కూతలేరులో మురుగునీరంతా వచ్చి చేరుతోంది. అన్ని గ్రామాల్లోనే ఇదే పరిస్థితి కొనసాగుతోంది. సమస్యలకు పరిష్కారం చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఈవోఆర్డీ శైలజారాణి స్పందిస్తూ అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

నార్పల, న్యూస్‌టుడే : నార్పల మండల పరిధిలోని పలు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. మండల పరిధిలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కేశేపల్లి, నార్పల, బి.పప్పూరు, గూగూడు, సిద్ధరాచెర్ల, నాయనపల్లి, బండ్లపల్లి తదితర గ్రామాల్లో మురుగు రహదారులపై పారుతోంది. గత ఐదేళ్ల వైకాపా పాలనలో గ్రామాల అభివృద్ధికి నిధులు విడుదల చేయకపోవడంతో మురుగు కాలువలు, సీసీ రహదారుల నిర్మాణం జరగలేదు. ఫలితంగా ఇళ్లలోని మురుగునీరు రోడ్లపైకి చేరి రోజుల తరబడి నిల్వ ఉంటోంది. ఆప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమకాటుతో వ్యాధులు ప్రబలుతున్నాయి.

ఏ గ్రామానికి వెళ్లినా అంతే!

● సచివాలయ, పంచాయతీ కార్యాలయాల్లో ఉద్యోగులు అందుబాటులో ఉన్నా సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కేశేపల్లి ఎస్సీ కాలనీలో రోడ్లపై మురుగు

ప్రధానంగా ముఖ్యంగా కేశేపల్లి పంచాయతీలో 800 కుటుంబాలు ఉన్నాయి. అంబేడ్కర్ కాలనీలో నెల రోజులుగా మురుగు నిలిచి ఉండటంతో కాలనీ ప్రజలు నడవటానికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

ఎమ్మెల్యే చొరవతో గుత్తి చెరువుకు జలకళ

గుత్తి, న్యూస్‌టుడే : ఎట్టకేలకు గుత్తిచెరువుకు జలకళ వచ్చింది. 20 ఏళ్ల నుంచి చెరువుకు నీరు రాలేదు. వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువుకు ఒట్టిపోయింది. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నిలుపుకొన్నారు. గత నెలలో హంద్రీనీవా కాలువ నుంచి నీరు విడుదల చేశారు. చెరువుకు ఇప్పటికే సుమారు 80 శాతం నీరు చేరింది. చెరువు నిండుకుండను తలపిస్తోంది. చెరువుకు నీరు చేరడంతో పట్టణంలోని బోర్లలో నీటి ఊటపెరుగుతోంది.

● పట్టణంలో 123 స్పాట్‌డెలివరీ ట్యాంకులు ఉన్నాయి. వాటిబోర్లలో నీటి లభ్యత పెరిగింది. ప్రజలు వాడుకకు బోర్ల నీటిని వినియోగించుకుంటున్నారు. చెరువుకు నీరు చేరుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చెరువుకు చేరిన నీరు

గత పరిస్థితి నుంచి గట్టెక్కి

గుత్తి చెరువుకు నీరు లేక వెయ్యి ఎకరాల ఆయకట్టు బీడుగా మారింది. ఆయకట్టులో ఒకప్పుడు రెండు పంటలు సాగు అయ్యేవి. చెరువు నిండితే గుత్తితోపాటు పరిసరాల్లో గ్రామాల్లో తాగునీటి సమస్య పెద్దగా ఉండదు. బోరుబావుల్లో నీరు సమృద్ధిగా ఉంటుంది. చెరువు నిండకపోతుండటంతో ఆయకట్టు రైతులు తాము పంటలు సాగు చేసుకోలేకపోతున్నామని రైతులు, తాము తాగునీటి సమస్యతో సతమతమవుతున్నట్టు ప్రజలు వాపోతున్నారు. ఇప్పుడా ఆ పరిస్థితిని కొంత వరకు గట్టెక్కామంటున్నారు.

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

సాఫ్ట్‌టెన్నిస్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: కాకినాడలో జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌టెన్నిస్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఎంపిక చేశారు. గురువారం నగరంలోని టెన్నిస్ అకాడమీలో ఎంపిక పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ చూపిన రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 98 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

అండర్-14 బాలురు: ధీరజ్, సుప్రతీక్‌రెడ్డి, సోనిత్‌రెడ్డి, దయనేశ్వర్‌రెడ్డి, జయదేవ్, రాహుల్‌గాంధీ

అండర్-14 బాలికలు: ప్రియారెడ్డి, హాసిని, ఆనంహబాబ్, అరిఫా, జారా, ఓజస్విని, పి.హాసిని

అండర్-17- బాలురు: అలియా, సోని, కిరణ్మయి, తనుశ్రీ, బ్రాహ్మిణి, రోషిని, వర్ష, రిత్విక్‌రెడ్డి

బాలికలు: కుమార్, జీవన్, యశ్వంత్, కిరణ్‌కుమార్, కార్తీక్, నాగమోహన్, వందన్‌రెడ్డి, లక్ష్మీనరసింహ

సహకార సంఘం ఎన్నికలు నిర్వహించండి

అనంతపురం(వ్యవసాయం): వైకాపా ప్రభుత్వం ఐదేళ్లుగా జిల్లా గొర్రెల పెంపకందార్ల సహకార సంఘం ఎన్నికల నిర్వహించకుండా సంఘాలన్నీ నిర్వీర్యమయ్యాయని, తక్షణమే సహకార సంఘం ఎన్నికల నిర్వహించాలని పలువురు సంఘం కోరారు. గురువారం పశు సంవర్ధకశాఖ అనంతపురం డివిజన్ కార్యాలయంలో ఉప సంచాలకులు, పర్సన్ ఇన్‌ఛార్జి డాక్టర్ రమేశ్‌రెడ్డి అధ్యక్షతన గొర్రెల పెంపకందార్ల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం మాజీ అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ జిల్లాలో 300 గొర్రెల సహకార సంఘాలున్నాయి. ఐదేళ్లుగా ఎన్నికలు జరగలేదు. సంఘాలకు ఎలాంటి ప్రయోజనం అందక నిర్వీర్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005 రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: నగరంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో బుడ్డప్ప నగర్‌లో పారిశుద్ధ్య సిబ్బంది వారం రోజులుగా శుభ్రం చేయడం లేదు.
-స్థానికులు

సమాధానం: వెంటనే శుభ్రం చేయిస్తాం.

సమస్య: గడియార స్తంభం వద్ద ఉన్న బ్రిడ్జిపై లైట్లు కొన్ని వెలగడం లేదు.
- ప్రదీప్ కుమార్

సమాధానం: తగు చర్యలు తీసుకుంటాం

- పై ప్రశ్నలకు నగరపాలక ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి, డీఈ దాక్షాయిణి సమాధానాలు ఇచ్చారు. – న్యూస్‌టుడే, అనంత నగరపాలక

లైట్లు పగటిపూట వెలగకుండా చర్యలు

స్పందనకు వందనం

రాణినగర్: నగరంలోని చెరువు కట్ట కింద, భవాని నగర్ ప్రధాన రోడ్డులో హైమాస్ట్ లైట్లు పగలు వెలగకుండా చర్యలు చేపట్టారు. మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను తెలియజేయడంతో నగరపాలక డీఈ దాక్షాయిణి సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు.

గృహ నిర్మాణాలపై దృష్టి సారించాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: గతంలో గృహ నిర్మాణాలు చేపట్టి పూర్తి కాని వాటిపై దృష్టి సారించాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ అనిల్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో గురువారం సచివాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. గతంలో గృహ నిర్మాణాలను చేపట్టి ఎంతో మంది పూర్తి చేయలేక పోయారని అన్నారు. మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో లబ్ధిదారుల్లో చైతన్యం తీసుకువచ్చి నిర్మాణాలు పూర్తి అయ్యేలా కృషి చేయాలన్నారు

పాఠశాల పరిసరాలు..
అపరిశుభ్రతకు నిలయాలు

ప్రవేశ ద్వారం ముందే..



పాతూరులోని ప్రభాకర్‌జీ నగరపాలక ప్రాథమిక పాఠశాల గేటు ముందు వదిలేసిన వ్యర్థాలివి. భవన నిర్మాణ వ్యర్థాలు ఇలా పాఠశాల ముందు వేశారు. ఇక్కడ తరచూ చెత్త, చెదారం పడవేస్తుంటారు. వ్యర్థాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గతంలో జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. కానీ మార్పు రాలేదు.

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: కేంద్రప్రభుత్వం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రతి విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమం జరుగుతోంది. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం కోసం అక్టోబరు 2వ తేదీ వరకూ దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం జరుగుతోంది. పాఠశాలలు, కళాశాలల ఆవరణలు శుభ్రం చేస్తున్నారు. అనంత నగరం మున్సిపల్ పాఠశాలల వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. చిన్న తరగతుల విద్యార్థులు స్వచ్ఛత పనులు చేపట్టలేరు. నగరపాలక యంత్రాంగం, పారిశుద్ధ్య కార్మికులతో స్వచ్ఛత పనులు చేయించాలి. ప్రధాన కూడళ్లలో అర్భాటం చేసి, చేతులు దులుపుకొంటున్నారు. విద్యార్థులుండే పాఠశాలలు, వాటి పరిసరాల్లో స్వచ్ఛత పనులు చేపట్టకపోవడం దారుణం. కాలనీల్లో పారిశుద్ధ్య సమస్య పీడిస్తోంది. కనీసం విద్యాసంస్థల సమీపంలోనైనా పారిశుద్ధ్యం మెరుగు చేయడంలేదు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ర్యాలీలు, ప్రతిజ్ఞ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేయడం లేదు. సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పాఠశాలల వద్ద అపరిశుభ్రత నెలకొంటోంది.

వ్యర్థాలు తొలగించరేం?



నగరపాలకసంస్థ కార్యాలయానికి ఆనుకొని ఉన్న కేఎస్ఆర్ ప్రభుత్వ బాలిక పాఠశాల ముందున్న మురుగుకాలువ ఇలా వ్యర్థాలతో పేరుకుపోయి. ఈ కాలువ నగరపాలక సంస్థ వరకూ ఉంది. కార్పొరేషన్ ముందున్న కాలువల్లో వ్యర్థాలు తొలగించకపోడం దారుణం.

పాములు, తేళ్లకు ఆవాసంగా..



తారకరామకొట్టాలలో ఉన్న వైఎస్ఆర్ నగరపాలక ప్రాథమిక పాఠశాల ప్రహరీకి ఆనుకొని ఉన్న వ్యర్థాలు ఇవి. పాఠశాల పక్కన వ్యర్థాలు, పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉన్నందున పాములు, తేళ్లు సంచరిస్తుంటాయి. పరిసరాల్లో వ్యర్థాలు లేకుండా చేస్తే విద్యార్థులకు ఇబ్బందులు తప్పుతాయి.

దుర్వాసనతో ఇబ్బంది..



ఉమానగర్‌లోని భారతి నగరపాలక ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న చెత్తచెదారం ఇది. స్థానికులు ఇంట్లో ఉన్న చెత్తను తెచ్చి బడి ముందు వేస్తుంటారు. అక్కడే మురుగునీటి కాలువ కూడా ఉంది. కాలువలోని పూడిక కూడా బడి ముందర వేస్తున్నారు. దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ బల్లాపల్లవి, తదితరులు

మేయర్ వ్యాఖ్యలపై మాజీ కార్పొరేటర్ల ఆగ్రహం

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు): ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌పై మేయర్ వసీం చేసిన వ్యాఖ్యలపై నగర మహిళా మాజీ కార్పొరేటర్లు స్పందించారు. మేయర్ నోరు అదుపులో పెట్టుకోవాలంటూ హెచ్చరించారు. మాజీ కార్పొరేటర్లు బల్లా పల్లవి, రహమత్‌బీ, వడ్డే భవానీ, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, నాయకురాళ్లు నాయుడమ్మ, సుమలత మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి స్క్రిప్ట్ ఇస్తేగానీ మాట్లాడలేని నువ్వు మా ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తావా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిముట్లు కొనుగోలులో గోల్‌మాల్ జరిగిందని, సాక్షాత్తూ మీ ఉప మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్యలే ప్రశ్నించారన్నారు. నగరంలో కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తుంటే మీరేం చేస్తున్నారన్నారు. ఒక్క మసీదుకు రూ.5 వేలైనా ఇచ్చావా? అని మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహమ్మద్, మాజీ ఎంపీపీ ఇస్మాయిల్ ప్రశ్నించారు.



స్టాలిన్‌నగర్‌లో కరపత్రం అందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్

'నష్టం కలిగిస్తే ఊరుకోం'

తపోవనం, కళ్యాణదుర్గంరోడ్డు: ప్రజల ప్రాణాలకు నష్టం కలిగించాలని చూస్తే ఊరుకోమని ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. ఇది మంచి ప్రభుత్వం నిర్వహణలో భాగంగా గురువారం అనంతపురం గ్రామీణం స్టాలిన్ నగర్, ఎ.నారాయణ పురం, తపోవనం కాలనీల్లో ముగింపు సభ నిర్వహించారు. కలెక్టర్ వినోద్‌కుమార్, తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ఆర్డీఓ వసంతబాబు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళీ, జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు హాజరయ్యారు. తొలుత కాలనీలో ఇంటింటికీ తిరిగారు. వందరోజుల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ముద్రించిన కరపత్రాలు, స్టిక్కర్లు ప్రజలకు అందజేశారు. అనంతరం సభలో ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైకాపా పాలనలో జంతువుల కొవ్వును తిరుమల లడ్డూ తయారీలో వినియోగించి కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీశారని మండిపడ్డారు. అనంతపురం నగరాభివృద్ధికి వందరోజుల్లో పెద్ద ఎత్తున నిధులు వచ్చాయన్నారు. నారాయణపురం పంచాయతీలో 50 లక్షలతో సీసీ రోడ్లు, నిర్మాణం రూ.5 కోట్లతో వంతెన నిర్మాణం కూడా చేపట్టామన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు.

మైనార్టీల సంక్షేమం ధ్యేయం

అనంత సాంస్కృతికం: మైనార్టీల సంక్షేమానికి తెదేపా ప్రభుత్వం కట్టుబడి ఉందని దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం డ్రైవర్స్ కాలనీలో రహీం ఖాద్రి మసీదుకు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ముతవల్లీల సంఘం అధ్యక్షుడు, జామీయా మసీదు ముతవల్లీ కేఎం. షకీల్ షఫీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్వచ్ఛ సమాజం అవసరం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: పరిసరాలు పరిశుభ్రం చేసుకోవడం వల్ల స్వచ్ఛ సమాజం ఏర్పడుతుందని శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. స్వచ్ఛత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. పరిశుభ్రత ఉన్నచోట మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.



ఎస్కేయూలో నిర్వహించిన ర్యాలీలో ఇన్‌ఛార్జి వీసీ అనిత, ఆచార్యులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

విద్యార్థులకు పోటీలు

అనంతపురం విద్య: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ తయారీ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. వీటితో పాటు బాల్యవివాహాలు అరికట్టడం అనే అంశంపై 8, 9, 10, ఇంటర్ తరగతుల విద్యార్థులకు లఘు చిత్ర ప్రదర్శన, లఘునాటిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సైన్స్ సెంటర్‌లో ఈ నెల 30న ఈ పోటీలు జరుగుతాయన్నారు.

మల్టీ లెవల్ పార్కింగ్ పనుల్లో కదలిక

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో మూడేళ్ల అనంతరం కదలిక వచ్చింది. కాలుష్యాన్ని నివారించడం, ట్రాఫిక్ తగ్గించడం కోసం జాతీయ స్వచ్ఛత గాలి పథకం ద్వారా నగరంలో 3 ప్రాంతాల్లో రూ.50 లక్షలతో మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినా ఆచరణలోకి రాలేదు. గతంలో వైకాపా హయాంలో పలు కథనాలు ఇచ్చిన పట్టింపు లేదు. ఇటీవల ఈనాడులో లోపం ఎక్కడ.. నిర్లక్ష్యం ఎందుకు? శీర్షికన కథనం ప్రచురించడంతో గురువారం సాయంత్రం కలెక్టరు వినోద్‌కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చారు. నగరంలోని గడియార స్తంభం వద్ద ఉపరితల వంతెన కింద, పాతూరు మార్కెట్ వద్ద తాడిపత్రి బస్టాండ్ సర్కిల్ వద్ద స్థలాలను పరిశీలించారు. ఒక్కోచోట 30+30 ద్విచక్ర వాహనాలు, 10+10 నాలుగు చక్రాల వాహనాలు, 10+20 మిక్స్‌డ్ వాహనాలు నిలిపేందుకు స్థలాలు గుర్తించారు. ఒక్కో ప్రాంతంలో రూ.50 లక్షలు వినియోగిస్తామన్నారు. గడియార స్తంభం వంతెన కింద ఖాళీ స్థలంలో పచ్చదనం ఉండే విధంగా అందంగా తీర్చిదిద్దాలన్నారు. అంతకు ముందు కోర్టు రోడ్డులో ఉన్న ప్రజా ఆరోగ్య విభాగం ఎస్ఈ కార్యాలయంలో ఎన్‌క్యాప్ నిధులతో కొనుగోలు చేసిన పరికరాలను పరిశీలించారు.

విద్యార్థి అదృశ్యం



జగదీష్

గుడివాడ గ్రామీణం: పాఠశాల నుంచి పదో తరగతి విద్యార్థి అదృశ్యమైన సంఘటనపై గురువారం కేసు నమోదు చేశామని గుడివాడ తాలూకా పోలీసులు తెలిపారు. కృష్ణా జిల్లా గుడివాడ సమీపంలోని వలివర్తిపాడు గ్రామ పరిధిలోని న్యావిజన్ రెసిడెన్షియల్ పాఠశాలలో అనంతపురానికి చెందిన టి.కృష్ణ మోహన్ కుమారుడు జగదీష్ 10వ తరగతి చదువుతున్నాడు. ఇక్కడ ఉండనని కొంత కాలం నుంచి జగదీష్ తెలపగా తల్లిదండ్రులు బుజ్జగించి దసరాకు తీసుకెళ్తామని చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో జగదీష్ ఈ నెల 24న పాఠశాల నుంచి అదృశ్యమైనట్లు తల్లిదండ్రులకు చెప్పామని, అతని ఆచూకీ లభించకపోవడంతో పాఠశాల ప్రిన్సిపల్ నౌటూరి గంగా మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం



మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఆజాద్‌నగర్ (అనంతపురం): విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామని ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు హనుమంత రాయుడు, కుల్లాయిస్వామిలు పేర్కొన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆ ఫెడరేషన్ 49వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. నూతన విద్యా విధానం వల్ల విద్యాసంస్థలు మూతపడ్డాయని, ఆ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ నెల 27 నుంచి 30 వరకు విజయనగరంలో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల్లో తీర్మానాలు చేస్తామని తెలిపారు.

ఎన్టీఆర్ అభిమానుల సందడి



థియేటర్ వద్ద సందడి చేస్తున్న అభిమానులు

అనంతపురం(కమలానగర్): హీరో జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' చిత్రం విడుదల సందర్భంగా అనంతపురం నగరంలోని సినిమా థియేటర్ల వద్ద అభిమానులు గురువారం రాత్రి సందడి చేశారు. శుక్రవారం చిత్రం చిత్రం విడుదల కానుంది. రాత్రి నుంచే అభిమానులు పెద్ద ఎత్తున థియేటర్ వద్దకు చేరుకొని టికెట్ల కోసం వేచి చూస్తున్నారు. థియేటర్ల చుట్టూ ఎన్టీఆర్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ఎన్టీఆర్ చిత్రాలను పూలతో అలంకరించారు. దేవర చిత్రం మంచి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నగరంలోని 10 థియేటర్లలో ఈ చిత్రం విడుదల కానుంది.

తెరపై ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే : గంగ, గౌరి, గాయత్రి, గౌతమి, త్రివేణి, తరంగిణి, తేజస్విని, ఎస్వీ సినిమాక్స్, నీలిమ, సుధా : దేవర.

వంటనూనె విక్రేతలపై కొరడా

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన



నగరంలో వంటనూనెల దుకాణంలో తనిఖీ చేస్తున్న లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలరు సుధాకర్.

అరవిందనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: తూకాల్లో మోసాలు అన్నీ ఇన్నీ కావు. వంట నూనెలు, విత్తనాలు కొనుగోళ్ల సమయంలో కొందరు వ్యాపారులు తమ కనికట్టు విద్యను ప్రదర్శిస్తూ పలువురిని నిలువునా మోసం చేస్తున్నారు. మోసపోతున్న వారిలో రైతులు ఎక్కువగా ఉంటున్నారు. తూనికలు, కొలతలశాఖ అధికారులు చేసిన ఆకస్మిక తనిఖీలో కొన్నిచోట్ల వ్యాపారులు గిమ్మిక్కులు వెలుగు చూశాయి.

● బియ్యం, కందిపప్పు, వంట నూనెలు, నిత్యావసర వస్తువులు కొనుగోలు సమయంలో వినియోగదారులు నష్టపోకుండా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ త్రాసును అందుబాటులోకి తీసుకువచ్చాయి. కొనుగోలుదారులను ఆకట్టుకునేలా ఆకర్షణీయ పొట్లాల్లో విక్రయిస్తున్నారు. పొట్లం మీద బరువు, గరిష్ఠ అమ్మకం ధర, తయారుదారుని పూర్తి చిరునామా, తయారు చేసిన నెల, తేదీ, సంవత్సరం, వినియోగదారుడు ఫిర్యాదు చేయడానికి ఉండాల్సిన పేరు, చిరునామా, ఫోన్ నంబరు, ఈ మెయిల్ ఐడీ, యూనిట్ సేల్ ప్రైస్, తదితర వివరాలు ముద్రించాలని నిబంధన. వాటిల్లో ప్యాక్ చేసిన సరకు కొనుగోలులో వినియోగదారులు నష్టపోకూడదని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్యాకేజీ కమాడిటీ చట్టం మేరకు మార్గదర్శకాలు అమలు చేస్తున్నాయి.



వెలుగు చూసిన అక్రమాలివీ..

● కొందరు వ్యాపారులు లీటరు వంట నూనె పొట్లంలో 25 నుంచి 30 మిల్లీ లీటర్లు తక్కువ తూకం.. గరిష్ఠ అమ్మకం ధరను మించి విక్రయిస్తున్న తీరు బయట పడింది. వినియోగదారుడు ఫిర్యాదు చేయడానికి పొట్లం మీద ఈ మెయిల్ ఐడీ వివరాలు ముద్రించకుండానే వంట నూనెలు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

● నగరంలో టోకు వ్యాపారి వంట నూనె లీటరు పొట్లంపై వినియోగదారుడు ఫిర్యాదు చేయడానికి పొట్లం మీద ఈ మెయిల్ ఐడీ, తదితర వివరాలు ముద్రించ లేదని గుర్తించి రూ. 25 వేలు జరిమానా విధించారు.

● హిందూపురం పట్టణంలో పొట్లం మీద ముద్రించిన ధరకు మించి అధిక ధరకు అమ్ముతున్న ఐదుగురు వ్యాపారులపై కేసు నమోదు చేశారు.

● వ్యాపారులు గరిష్ఠ అమ్మకం ధరకు మించి అమ్ముతున్న 8 మంది వ్యాపారులపై రూ.1.20 లక్షలు జరిమానా విధించారు. సత్యసాయి జిల్లాలో నిబంధనలు పాటించని 6 మంది వ్యాపారులపై కేసు నమోదు చేశారు.

అధిక ధరకు విక్రయిస్తే జరిమానా..



ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2023 మార్చి నుంచి 2024 ఆగస్టు నాటికి 290 దుకాణాల్లో తనిఖీ చేసి నిబంధనలు పాటించని 30 మంది వ్యాపారులపై 5.70 లక్షలు జరిమానా విధించాం. తాజాగా 2024 సెప్టెంబరు నెలలో వంటనూనెల దిగుమతిపై కేంద్రం సుంకం పెంచిన నేపథ్యంలో కొందరు వ్యాపారులు గరిష్ఠ అమ్మకం ధరకు మించి అమ్ముతున్న 14 మంది వ్యాపారులపై రూ.1.52 లక్షలు జరిమానా విధించాం నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం'

- తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలరు సుధాకర్, తనిఖీ అధికారి మహమ్మద్ గౌస్

శస్త్రచికిత్సకు భయపడి వృద్ధుడి పరారీ

అనంత నేరవార్తలు: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ వృద్ధుడు శస్త్రచికిత్స చేస్తారనే భయంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన అనంతపురం గ్రామీణంలో చోటు చేసుకుంది. కురుగుంట గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి గుండె సంబంధిత వ్యాధితో బాధపడేవాడు. ఇటీవల నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్లగా, వైద్యులు గుండెకు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. అన్ని పరీక్షలు నిర్వహించి ఈనెల 23న ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. భయపడిన వృద్ధుడు ఈనెల 22న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో అనంతపురం గ్రామీణం పోలీసుస్టేషన్‌లో బాధితుడి కుమారుడు సురేశ్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి గాయాలు

అనంత నేరవార్తలు : అనంతపురం నగరం తపోవనం కూడలి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. భవానీనగర్‌కు చెందిన హమీదా, మహబూబీలు తపోవనం కూడలిలో ఆటో దిగి తపోవనం వైపు వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా, గుత్తి వైపునకు ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. హమీదా తలకు తీవ్రగాయమైంది. మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు.

స్నానాల గదిలో జారిపడి హిజ్రా మృతి

అనంత నేరవార్తలు: అనంతపురం నాలుగో పట్టణ పోలీసుస్టేషను పరిధిలోని రుద్రంపేటలో ఓ హిజ్రా స్నానాలగదిలో జారిపడి మృతి చెందింది. కర్నూలు, గుంటూరు జిల్లాలకు చెందిన 9 మంది రుద్రంపేటలో ఓ ఇంట్లో ఉంటున్నారు. వీరిలో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన హిజ్రా రవితేజ అలియాస్ హిమబిందు కొంతకాలంగా నరాల బలహీనతతో బాధపడుతోంది. గురువారం ఉదయం స్నానాల గదిలోకి వెళ్లాక కొద్దిసేపటికి పెద్ద శబ్దం వచ్చింది. తలుపులు గట్టిగా తోసి చూడగా, ముక్కు నుంచి రక్తం కారుతూ హిమబిందు కనిపించింది. 108 ద్వారా ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

పింఛనుదారులకు రాయితీ చెల్లించాలి

రుద్రంపేట, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 5 సంవత్సరాలలో ప్రభుత్వ పింఛన్‌దారులు సాధించుకున్న రాయితీలు కోల్పోయామని, ప్రధానంగా వయసు మళ్లిన పింఛన్ దారులు రాయితీలు అనుభవించలేక పోతున్నారని ప్రభుత్వ పింఛను దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న గౌడ్ పేర్కొన్నారు. తెదేపా ప్రభుత్వంలో మాకు న్యాయం చేస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నామన్నారు. 2018 నుంచి రావాల్సిన కరవు భత్యం బకాయిలను విడుదల చేయాలని, అదనపు క్వాంటమ్ పింఛన్‌ను యథావిధిగా పునరుద్ధరించాలన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

దివ్యాంగులను ప్రోత్సహించండి

అనంత సంక్షేమం: దివ్యాంగులను అన్ని విధాలుగా ప్రోత్సహించాలని పలువురు పేర్కొన్నారు. మానసిక పరిపక్వత లేక జీవిస్తున్న పిల్లలను చేరదీసి వారి సంరక్షణ బాధ్యత చేపట్టి నిర్వహిస్తున్న రాష్ట్రీయ సేవా సమితి వికాస్ విహార్ సేవలను పలువురు కొనియాడారు. ఎన్కేసీ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి కమల్‌నాథ్ ఆధ్వర్యంలో చిన్నారులకు రెండు చెక్క కుర్చీలు, సంచులు, పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.

ఆసుపత్రికి వాహనం వితరణ

అనంతపురం(వైద్యం): ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఎంపీ లాడ్స్ కింద రూ.8.8 లక్షల వ్యయంతో మహాప్రస్థానం వాహనాన్ని సమకూర్చారని సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆసుపత్రిలో చనిపోయిన మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించేందుకు మహాప్రస్థానం వాహనాలు వినియోగిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే రెండు ఉన్నాయన్నారు. నూతన వాహనాన్ని అక్టోబరు 1 నుంచి అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

కుష్ఠు తొలిదశలోనే గుర్తించాలి

అనంతపురం(వైద్యం): కుష్ఠువ్యాధిని తొలి దశలోనే గుర్తించాలని ఆ విభాగం అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ తెలిపారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో పారా మెడికల్ ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కుష్ఠువ్యాధి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మందులు వాడితే వ్యాధి నయం అవుతుందన్నారు.

బీసీల కులగణన అవసరం

అనంతపురం (గుల్జార్‌పేట): దేశవ్యాప్తంగా బీసీల కులగణన చేయాలని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఆ సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వాలు, పాలకులు బీసీల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైన కులగణన ప్రతిపాదికన రిజర్వేషన్లు కల్పించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు. రజక సంఘం అధ్యక్షుడు మల్లేశ్, బీసీఎఫ్ నారాయణ స్వామి, బీసీ యువజన సంఘం ప్రసాద్, నాయకులు విష్ణు, రాజేశ్, రామాంజి, వీరేశ్ పాల్గొన్నారు.

తాత్కాలిక పైపులతో ఉపశమనం

రాప్తాడు: రాప్తాడు నుంచి జగనన్న కాలనీ, చిన్మయ్‌నగర్‌కు వెళ్లే రహదారిగుండా హంద్రీనీవా నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలికంగా పైపులు వేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా రహదారికి మరమ్మతులు నిర్వహించారు.

యువకుల రక్తదానం

బుక్కరాయసముద్రం: అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కుమారుడు వీక్షిత్ పుట్టినరోజు సందర్భంగా తెదేపా, జనసేన కార్యకర్తలు ఏర్పాటు చేసి శిబిరంలో యువత స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు.



కాలువపై పైకప్పులు మరిచారు

రుద్రంపేట పంచాయతీ పరిధిలోని విశ్వశాంతి నగర్ వెనుక భాగంలో వరద నీరు ప్రవహించేందుకు నిర్మించిన రక్షణ కాలువకు పైకప్పు నిర్మాణం మరిచిపోయారు. స్థానికంగా నివాసం ఉంటున్న కుటుంబాలు రాకపోకలు సాగించడం కోసం ఇబ్బందులు పడుతున్నారు. రక్షణ కాలువపై తాత్కాలికంగా సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. - **న్యూస్‌టుడే, రుద్రంపేట**